# 8

# క్రీస్తు పరిచర్య యొక్క అతీతత్వము

## (8:1-13)

8వ అధ్యాయంలో మొదటి కొన్ని వచనాలు 4:14–7:28లో చర్చింపబడిన కుమారుని యాజకత్వ పదవి నుంచి కొంచెము ప్రక్కకు తొలగుచున్నవి, ఆయన యొక్క అత్యంత శ్రేష్ఠమైన యాజకత్వ పరిచర్య దిశగా వెళ్లుచున్నవి (వచనములు 1–5). మన ప్రధాన యాజకుడుగా, క్రీస్తు యొక్క అతీతత్వమునకు సంబంధించిన ఈ క్రింది సత్యములను మనకు హెబ్రీ పత్రిక బోధిస్తుంది:

1. క్రీస్తు మెల్కీసెదెకు క్రమము చొప్పున దేవుని చేత పిలువబడెను (5:10).
2. దైవికమైన ఒక ప్రమాణము క్రీస్తును యాజకత్వ పదవిలో ఉంచినది (7:20–22).
3. ఆయన ప్రధాన యాజకత్వము శాశ్వతమైనది (7:23, 24).
4. ఆయన కార్యములు సంపూర్ణముగా కార్యసార్థకమైనవి (7:25).
5. ఆయన వ్యక్తిగత అర్హతలు ఆయన నిరంతరము మన ప్రధాన యాజకుడుగా పరిచారము చేయుటకు ఆయన సమర్థవంతునిగా చేసాయి (7:26–28).
6. ఆయన పరలోకమందలి పరిశుద్ధ స్థలములో పరిచారము చేయుచున్నాడు, ఇహలోక సంబంధమైనది కాదు (8:1–5).
7. మన పాపములు మనకు విరోధముగా యిక మీదట ఎన్నటికిని జ్ఞాపకము చేసికొనబడకుండునట్లు సంపూర్తి క్షమాపణను ఇచ్చే, క్రొత్త నిబంధన నిచ్చుటలో ఆయన తన వంతు పాత్ర వహించాడు (8:6–13).

మన ప్రధాన యాజకుని పరిచర్య యొక్క లక్షణములేమై యున్నవి?

### ఆయన నూతన పరిచర్య (8:1–5)

#### నిజమైన గుడారములోని పరిచారకుడు (8:1, 2)

**1-2మేము వివరించుచున్న సంగతులలోని సారాంశమేదనగా, మనకు అట్టి ప్రధానయాజకుడు ఒకడున్నాడు. ఆయన పరిశుద్ధాలయమునకు, అనగా మనుష్యుడుకాక ప్రభువే స్థాపించిన నిజమైన గుడారమునకు పరిచారకుడైయుండి, పరలోకమందు మహామహుని సింహాసనమునకు కుడిపార్శ్వమున ఆసీనుడాయెను.**

**వచనములు 1, 2. ముఖ్యమైన విషయము** (*kephalaios*) అనే పదము "సారాంశము" లేక "ప్రధాన విషయము" అని అర్థమియ్యవచ్చు. చివరి పదము ఎంపిక చేసుకొనుట యుక్తము ఎందుకనగా ఈ విభాగము రచయిత చేయుచున్న తర్కము యొక్క చరమ

స్థాయిని నివేదిస్తుంది మరియు అది సారాంశమును మించినదై యున్నది.[1] మన ప్రధాన యాజకుడు తక్కువైన నిబంధనతో కూడ పనిచేయడు; ఆయన స్థానము మిన్నయైన దానితో కూడ ఉన్నది.

క్రీస్తు ఆసీనుడాయెను ఎందుకనగా ఆయన చేయవలసి యుండిన బలియాగ కార్యము ముగిసింది. "ఆసనము" అనే పదము ఆయన తన సింహాసనము మీద ఆసీనుడై మన రాజుగా ఏలుచున్నాడని సూచిస్తుంది. యూదులైనవారి ప్రధాన యాజకులలో ఏ ఒక్కరైనను ఎప్పుడైనను ఒక్క *సింహాసనము* మీద ఆసీనులు కాలేదు. మనము అధికారపూర్వకమైన ఆయన పరిచయ పత్రములు తప్పులేమిరానివై యున్న ప్రధాన యాజకుని కలిగియున్నామనేది ఉద్ఘాటింపబడుతున్న విషయమై యున్నది. అసలైన లోకం కంటికి కనబడనిదై యున్నది మరియు మనము దానిని విశ్వాసముతో అంగీకరించుచున్నామనే (వచనము 2) విషయాన్ని హెబ్రీ పత్రిక విదితం గావిస్తుంది; ఇది క్రీస్తు ఒక "ప్రధాన యాజకుడై" (6:20) లేక "పరిచారకుడై" (8:2) యున్న ప్రదేశమై యున్నది. ప్రస్తుత గుడారము ఒక "నిజమైన" దాని "నకలు" మాత్రమే అయియున్నది (8:5; 9:24), కాని అది మనకు "పరలోక పట్టణము" (11:16) గూర్చిన హామీ ఇచ్చుచున్నది.

**పరలోకము** అనే పదము సరైనదై యున్నది, ఏలయనగా మూల గ్రంథ పాఠము హెబ్రీ పత్రికలోని పది సందర్భములలో ఏడింటిలోను బహువచనమున్నది. ఎఫెసీ పత్రికలో ఈ పదము ఎల్లప్పుడు బహువచనములోనే చెప్పబడి యున్నది. హెబ్రీయులకు 9:23లో బహువచనమున్నది, అయితే 9:24లో ఏక వచనమున్నది. బహుశా తేడా, ఏమైనా ఉన్నట్లయితే, కొంచమే అయియుండవచ్చు మరియు అది ఉద్దేశింపబడినదే.[2] బహు వచనము ఇది దేవుడు నివసించు స్థలము మరియు ఆయనతో కూడ క్రీస్తు ఆసీనుడైయున్న స్థలమనే అభిప్రాయమును కలుగజేయవచ్చు.

దేవుని చేత నిర్దిష్టముగా నియామకము చేయబడిన ఒకరు వారి ప్రధాన యాజకుడై యున్నందుకు క్రైస్తవేతరులైన యూదులు తమ్మును తాము అతీతరమైనవారుగా పరిగణించుకున్నారు; క్రైస్తవ విధానం తక్కువైనదై యుండింది ఎందుకనగా వారికి ఇటువంటి ప్రధాన యాజకుడు లేకుండెను. ఏది ఏమైనా, మొదటి శతాబ్దములో అనేకులు వారి ప్రధాన యాజకులను చిన్నచూపు చూసారు. ఎస్సేనీయులు – మృత సముద్రపు కాగితపు చుట్టలు తయారు చేసిన కుమ్రాన్ సమాజమునకు చెందినవారి గూర్చి జోసీఫస్ చేత వాడబడిన పదమై యున్నది – వీరి సంఖ్యలో చేరియుండిరి. వారి ప్రధాన యాజకుడిని దేవుడు తృణీకరించాడని వారనుకున్నారు.[3] అట్లయినప్పటికిని, "దేవుని చేత నియమింపబడిన ప్రధాన యాజకుడు మాకున్నాడు, కాని మీకు లేడు" అని వారు క్రైస్తవులకు చెప్పవచ్చునని వారు నమ్మారు. పైపెచ్చు, క్రీస్తు ఎంతో అతీతమైనవాడై యున్నాడు గనుక ఆయన **దేవుని కుడి పార్శ్వమున** సింహాసనాసీనుడై. పరలోకములో నుంచి ఏలుబడి సాగిస్తున్నాడు. ఈ మాటలు ఏ మానవ యాజకుని గూర్చి చెప్పబడజాలవు.

క్రీస్తు **పరిశుద్ధాలయమందు పరిచారకుడై** యున్నాడు. "పరిచారకుడు" (*leitourgos*) అనే మాటకు ఉన్నత శ్రేణికి చెందిన ఒక ప్రజా అధికారి, లేక ఒక "యాజకత్వమునకు సంబంధించిన పరిచారకుడు" అని అర్థము. "పరిశుద్ధాలయము" పరలోకమును, నిజమైన "అతి పరిశుద్ధ స్థలమును" సూచిస్తుంది, అచ్చటి దేవుని సముఖములో నుంచి యేసు

పరిచారము చేయుచున్నాడు. ఇహలోక ప్రధాన యాజకుడు పరలోకములో ఉన్న దాని కేవలము ఒక ఛాయయై, ఒక రూపమై యుండిన పరిశుద్ధ స్థలములో నుంచి పరిచారము చేయుచుండెను. **నిజమైన** అనగా, ఛాయ యొక్క నెరవేర్పు, అసలు విషయము, మరియు ఈ పదము ఇచ్చట "అబద్ధము" అని అర్థమిచ్చు దానికి తారతమ్యములో వాడబడలేదు. నిజమైన **గుడారము** (*skēnē*) పరలోకమునే సూచిస్తుంది. గుడారము, లేక డేరా, ఇశ్రాయేలీయుల చేత వారి మధ్య నివసించు దేవుని కొరకు ఒక నివాస స్థలముగా నిర్మింపబడినది మనము క్రొత్త నిబంధన ప్రకారము కలిగియున్న ఆశీర్వాదములకు ఒక నమూనా లేక ఛాయయై (వచనము 5) యుండింది. పరలోకమందలి పరిశుద్ధ స్థలము "బలిపీఠము" గూర్చిన ప్రస్తావనతో ప్రకటన 8:3-5 వర్ణింపబడింది, మరలా "ఆలయము" అనే ప్రస్తావనతో ప్రకటన 11:19లో వర్ణింపబడింది. గుడారము స్థానమును ఆలయము తీసుకున్నది, కాని హెబ్రీ పత్రిక రచయిత గతములోనిది ప్రస్తుత కాలమందున్నట్టుగా ఆదర్శమైన "గుడారము" గూర్చి మాటలాడుచున్నాడు.

ఈ గుడారమును మనుష్యుడుకాక ప్రభువే స్థాపించాడని చెప్పబడుతుంది. ఇది సంఘ నిర్మాణమును సూచించుచుండవచ్చు.[4] సంఘము క్రీస్తు చేత కట్టబడింది, మనుష్యుని చేత కాదు. "మనుష్యుడుకాక ప్రభువే స్థాపించాడని" పరలోకము గూర్చి విశ్వాసులకు తెలియజెప్పడము అవసరమై యుండదు. ఇచ్చటి తారతమ్యము దేవుని చేత సిద్ధపరచబడిన పరలోకమందలి గుడారమునకును ఇహలోకమందు మానవుని చేత ఏర్పాటు చేయబడిన దానికిని మధ్య ఉన్నది. సంఘము క్రొత్త నిబంధనలో తరచుగా "రాజ్యము" అని ప్రస్తావింపబడింది (ప్రకటన 1:9-11). అర్థములో భిన్నమైనదై యున్నప్పటికిని, ఈ శరీరములోని సభ్యత్వ సముదాయ నిర్మాణము గూర్చి ఆలోచించునప్పుడు ఈ రెండు పదములు మార్పిడిచేయబడవచ్చు (కొలొస్సయులకు 1:13, 18). సంఘము (*ekklēsia*) దేవుని "సభ"యై యున్నది (ఒక లౌకిక కూటమి గూర్చిన ప్రస్తావన తలెత్తినప్పుడు ఇది అపొస్తలుల కార్యములు 19:39, 41లో సరిగా అనువదింపబడింది). ఇది పరలోకమందు ప్రతిష్ఠింపబడింది గనుక దాని ప్రత్యక్ష ఉనికియే దేవుని జ్ఞానమును ప్రదర్శిస్తుంది (ఎఫెసీయులకు 3:10). గుడారములోని పరిశుద్ధ స్థలము సంఘమునకు ముందిచాయయై యున్నట్లయితే, సంఘము పరలోకమునకే ఇహలోకమందలి ప్రతినిధియై లేక ముందుఛాయయై యుండునుకదా? "పరలోక రాజ్యము" (మత్తయి వ్రాసిన సువార్తలో 32 సార్లు కలదు) అని అది తరచుగా ప్రస్తావింపబడుటలో గల కారణం ఇదే అయియుండవచ్చునా? గుడారమునకును అతి పరిశుద్ధ స్థలమునకును ఎలాంటి సంబంధం ఉండిందో అదే సంబంధం సంఘమునకును పరలోకమునకును కలదు.

గుడారములో ఉంచబడిన వస్తువులు సంఘములోని అభ్యాసములకు, ఉదాహరణ బల్ల, ధూపవేదిక, దీప స్తంభము మొదలగునవి అణుగుణముగానున్నవి. బల్ల, సంఘములోని ప్రభు భోజనమునకు చిహ్నాత్మకమైనదై యుంటుంది. సన్నిధి రొట్టెలుండిన బల్ల మీది రొట్టె యాజకుల చేత వారమునకొక పర్యాయం తినబడింది, మరియు క్రొత్త నిబంధన సంఘం ప్రభు రాత్రి భోజన సంస్కారము వారమునకొక పర్యాయం ఆచరించింది (అపొస్తలుల కార్యములు 20:7). ధూప వేదిక, ఆరోహణమగుచుండు ధూపముతో, మనము చేయు ప్రార్థనలు మరియు పాటల్లోని స్తుతులకు అనుగుణముగా ఉండవచ్చు (హెబ్రీయులకు

13:15 చూడుము; దీనికిని ప్రకటన 8:4లోని విషయమునకును గల దగ్గరి సంబంధమును గమనించండి). ఏడు దీపములుగల దీపస్తంభములో నుంచి వెలువడు వెలుగు దేవుని వాక్యమిచ్చు వెలుగును సూచింపవచ్చు (కీర్తనలు 119:105). క్రొత్త నిబంధన ప్రకారం, క్రైస్తవ ప్రభావముతో కూడిన వెలుగు మనము దేవుని వాక్యం ప్రకారం నడుచుకొనునప్పుడు దేవుని వాక్యము చేత కలుగజేయబడుతుంది (మత్తయి 5:14; 1 యోహాను 1:7). క్రైస్తవులు దేవుని ఆలయమై యున్నారని 1 కొరింథీయులకు 3:16లో చెప్పబడుతుంది. ఈ ప్రకారంగా పాత గుడారము ఒక నమూనాయై యుండిన దానికి సంఘము "నిజమైన గుడారమై" లేక దేవుడు నివసించు స్థలమై యుండవచ్చు.

**అర్పించడానికి అన్నీ వున్న యాజకుడు (8:3, 4)**

**[3]ప్రతి ప్రధాన యాజకుడు అర్పణలను బలులను అర్పించుటకు నియమింపబడును. అందుచేత అర్పించుటకు ఈయనకు ఏమైన ఉండుట అవశ్యము. [4]ధర్మశాస్త్ర ప్రకారము అర్పణలు అర్పించువారున్నారు గనుక ఈయన భూమిమీద ఉన్న యెడల యాజకుడై యుండడు.**

**వచనము 3.** ప్రాయశ్చిత్తం కొరకు అవసరమై యుండిన బలులు అర్పించుట ద్వారా ప్రజల పాపములతో వ్యవహరించుట యాజమాని పనై యుండిందని హెబ్రీయులకు 5:1 సెలవిస్తుంది. ఏది ఏమైనా, ఈ పని చేయుచుండినవాడు **అర్పణలను బలులను అర్పించుటకు నియమింపబడవలసి యుండింది.** మన **ప్రధాన యాజకుడు** తన అర్పణను సరిగ్గా ఎప్పుడు చేసాడో అటుతరువాత చెప్పబడింది (9:14); దాని గూర్చి చెప్పక మునుపే పాఠకులలో ఆసక్తిని లేవదీయాలన్న తాత్పర్యంతో రచయిత దాదాపుగా కోరుతున్నాడని అర్థమవుతుంది. ఇహలోక యాజకుడుగా, ఆయన తన అర్పణను అర్పించడానికి యేసునకు చోటుండేది కాదు, ఏలయనగా ఇహలోక పరిశుద్ధ స్థలం (దేవాలయము) మోషే ధర్మశాస్త్రమునకు లోబడుచుండిన యూదు యాజకులతో నిండియుండింది (వచనము 4; 7:12–14 చూడుము) "ఇది (ఈ వచనము) గొప్ప అర్థమునే ఇచ్చుచు యేసు తన ఇహలోక పరిచర్యలో యాజకత్వ పనులు ఎందుకు ఎన్నడును చేయలేదో వివరించుచున్నది."[5] దేవుడు ఒక్కొక్కసారి ఒక్క యాజకత్వమునకు మాత్రమే అధికారమిచ్చాడు; ఒకే నియమము ప్రకారం ఒకే సమయంలో రెండు యాజకత్వములు పనిచేయుటను ఆయన ఎన్నడు అనుమతించడు. సరికదా దేవుడు తన ప్రజలతో ఒకే కాలములో రెండు నిబంధనలు అమలు చేయడు. (ఇది 7:13, 14లోని దేవుని మౌనము గూర్చిన తర్కము వంటిదై యున్నది.)

**వచనము 4. ఈయన భూమి మీద ఉన్న యెడల యాజకుడై యుండడు.** యేసు పరలోకమందు పరిచారము చేయుచున్నాడు, ఇది ఆయన అతీతత్వమును సూచించుచున్న మరొక చెప్పుకోదగిన తారతమ్యమై యున్నది. యేసు లేవీ గోత్రమునకు లేక అహరోను (7:14). కుటుంబమునకు సహజంగానే, ఇహలోక పద్ధతి ప్రకారమైన యాజకుడు పరలోకమందలి పరిశుద్ధ స్థలములో పరిచారము చేయువాని కంటె ఎంతో అల్పుడై యున్నాడు.[6] ఇహలోక పరిశుద్ధ స్థలము యిక మీదట దేవుని నివాస స్థలము కాదు.

యేసు బలియాగము సిలువ మీద అర్పింపబడి యుండగా, ఆయన అర్పణ

పరలోకమందు అందజేయబడింది. ఆయన ఈ లోకంలో **ధర్మశాస్త్ర ప్రకారము అర్పణలను బలులను అర్పిస్తూ** ఒక యాజకుడుగా పనులు చేయలేకపోయాడు. ఈ ప్రకారం క్రీస్తు పరలోకమునకు తిరిగి వెళ్లనంత వరకు, రాజ్యము/సంఘము ఎన్నటికిని స్థాపింపబడకపోయి యుండవచ్చు, ఏలయనగా అప్పటి వరకు మానవులను విమోచించు సాధనోపాయము చట్టపరంగా నెరవేర్చబడలేదు (ఎఫెసీయులకు 5:25బి) (*Phillips* దండాన్వయము చేసినట్టుగా), యేసు యింకను తన అర్పణను అర్పించుచునే యున్నాడనే అంతర్భావమును ఇది ఇవ్వదు, ఏలయనగా ఆయన తన అర్పణను ఎప్పటికీ ఒక్కసారే అర్పించాడు (7:27; 9:28). ఈ ఒకే ఒక్క అర్పణ మనలను నిలకడగా మన పాపములలో నుంచి పవిత్రులనుగా చేయు నిరంతర అన్వయముగలదై యున్నది (1 యోహాను 1:7). అది యుగయుగములు నిలిచియుండు శక్తిగలదై క్రీస్తు ద్వారా దేవుని యొద్దకు వచ్చువారిని రక్షించుచునే యుండును (7:25).

యాజకులు మాత్రమే బలులు అర్పించారనే విషయాన్ని గమనించండి. ఇటువంటి స్తోమతకు నేటి ఆధునిక యాజకుడు అంతంత మాత్రమే ప్రయోజకుడై యుంటాడు ఏలయనగా యేసు పాపము విషయమై ఎప్పటికీ సరిపడు అర్పణను ఒక్కసారే అర్పించాడు. అదనపు అర్పణలు అక్కరలేనివగును. వ్యక్తిగతముగా మన జీవితములను మన రాజు సేవ నిమిత్తమై సమర్పించుకొని అనుదినము ఆయన కొరకు జీవించుటయే ఈనాడు మనము చేయవలసియున్న ఒకే ఒక్క బలియాగమై యున్నది (రోమీయులకు 12:1, 2).

**మాదిరి ప్రకారమైన యాజకుడు (8:5)**

**5మోషే గుడారము అమర్చబోయినప్పుడు**

**–కొండమీద నీకు చూపబడిన మాదిరిచొప్పున సమస్తమును చేయుటకు జాగ్రత్తపడుము అని దేవునిచేత హెచ్చరింపబడిన ప్రకారము ఈ యాజకులు పరలోకసంబంధమగు వస్తువుల ఛాయా రూపకమైన గుడారమునందు సేవచేయుదురు.**

**వచనము 5.** లేవీయులకు సంబంధించిన యాజకులు **పరలోక సంబంధమగు వస్తువుల ఛాయా రూపకమైన గుడారమునందు సేవచేయుదురు**. ధర్మశాస్త్రమునకు అంటిపెట్టుకొన్నవారుగా, వారు అల్పమైన మరియు సులభముగా నాశనమగు విషయాలను/వస్తువులను పట్టుకొని వ్రేలాడుచుండిరి. **మోషేకు** సీనాయి పర్వతముపై చూపింపబడిన దృశ్యము, ఒక విధంగా, పరలోకమందలి **దేవుని** నివాస స్థలము యొక్క ఒక ప్రతిరూపమై యుండింది. రచయిత రెండు లోకముల గూర్చి మాటలాడుచున్నట్టున్నది, పైన ఉన్న నిజమైన లోకం మరియు ఇహమందున్నదేదైనను ఒక "నకలు" అయియున్న లోకం. ఒక "ఛాయ" అస్పష్టమైన విషయమై, ఒక సంక్షిప్త వర్ణనయై యున్నది, అసలు విషయం కాదు. ధర్మశాస్త్రము గూర్చి పౌలు కొలొస్సయులకు 2:16, 17లో ఇదే విధమైన ప్రకటన చేసాడు (హెబ్రీయులకు 10:1, 2 కూడ చూడుము). మోషే ఇచ్చిన నియమమంతము, సబ్బాతుతో సహా, రాబోవుచుండిన వాటి ఛాయయై యుండింది. ఈ "ఛాయారూపకము" అనే విషయాన్ని కొందరు సంబంధిత క్రతువును వర్ణిస్తూ, "శిష్టాచార నియమము"నకు పరిమితం చేయుచుందురు; కాని లేఖనములలో ఇటువంటి విచక్షణ చూపింపబడలేదు. ఈ

రెండు పదములు బహుశా "పరలోకమందలి వాస్తవము గూర్చిన అస్పష్టమైన ఒక నకలుగా, కేవలము ఒక సూచనగా" "ఒక్క పదముగా కలిసిపోయి యుండవచ్చు."[7]

సరిగ్గా మోషేకు ఇయ్యబడిన **మాదిరి** చొప్పున ఇశ్రాయేలీయులు **గుడారమును** నిర్మించుకొనవలసి యుండింది, అందులో అవసరమైన వస్తు సామగ్రిని కూర్చుకొనవలసి యుండింది (నిర్గమకాండము 25:40). దీని అంతర్భావమును చూస్తే, యెరూషలేములోని దేవాలయము విషయంలో కూడ ఇదే వాస్తవమైనదయ్యింది. అపొస్తలుల కార్యములు 7:44 స్తెఫను ఇదే విధమైన అభిప్రాయమును నొక్కివక్కాణించాడు మరియు అదే పదమును, "మాదిరి"ని, *tupos* అనగా "నమూనా" లేక "ఉదాహరణము" అని అర్థమిచ్చు పదమును ప్రయోగించాడు.[8] మోషే తన సొంత నిర్ణయము చొప్పున, ఉత్తమమైనదని తాను తలంచిన విధంగా గుడారమును నిర్మించడానికి ఎటువంటి హక్కైనను అతనికి లేకుండింది. క్రొత్త నిబంధన ప్రకారం దేవుని "నూతన ఆలయము," సంఘములో మనము ప్రదర్శింపవలసిన మన విధేయత మరియు సభ్యత్వము గూర్చి మనము తక్కువ జాగ్రత్తపరులమై యుండగలమా? ఈ ప్రశ్నకు హెబ్రీయులకు 2:1-3లో సమాధానమియ్యబడింది: "మరి విశేష జాగ్రత్త కలిగియుండవలెను." నోవహు, ఓడ నిర్మాణం విషయంలో నిర్బధింపబడినవాడై, పూర్తిగా లోబడినాడు. క్రొత్త నిబంధన ప్రకారం కచ్చితమైన మరియు జాగ్రత్తతో కూడిన విధేయత చూపింపబడవలసి యున్నదనే అభిప్రాయమును గేలిచేయువారు, "క్రొత్త నిబంధన నియమ నిబంధనలతో కూడిన పుస్తకం కాదు. అది పాటించడానికి నిర్దిష్టమైన మాదిరులు లేని ఒక ప్రేమ లేకయై యున్నది" అని చెప్పుచుందురు. సహజంగానే, దేవుని వాక్యము నియమనిబంధనలు సవివరంగా వర్ణింపబడిన పుస్తకంగా, క్రమప్రకారమైన ప్రశ్నోత్తరములతో సహా, ఆ యా శ్రేణులకు సంబంధించిన అందమైన సాహిత్యమున్నది. ఇంకా, క్రొత్త నిబంధనలో "నియమములు"[9] అని పిలువబడే ఆదేశములున్నవనే విషయాన్ని, బైబిలును నిర్మలమైన హృదయంతో చదివే ఏ పాఠకుడైనను కాదనజాలడు. Jimmy Allen ముక్తసరిగా ఇలా చెప్పాడు, "నేడు అమలులో ఉన్న మాదిరి అంతా ఏదైనా ఒక నిర్దిష్టమైన అంశము గూర్చి క్రొత్త నిబంధనలో తెలియజెప్పుచున్నదే అయియున్నది."[10]

మోషే **హెచ్చరింపబడ్డాడు** (*chrēmatizō*), దీనిని "దైవికముగా మందలింపబడ్డాడు" అని కూడ అనువదింపవచ్చు. ఇదే పదము NKJVలోని మత్తయి 2:12 మరియు హెబ్రీయులకు 11:7లో "దైవికముగా హెచ్చరింపబడెను" అనియు, అపొస్తలుల కార్యములు 10:22లో "దైవికముగా బోధింపబడెను" అనియు అర్థమిచ్చుచున్నది. "మాదిరి" **చొప్పున** అనే మాటలు, మోషే **కొండ మీద** ఉన్నప్పుడు అతని కొరకు ఒక ప్రణాళిక సిద్ధం చేయబడిందని సూచించుచున్నవి. "మాదిరి" (*tupos*) అనే పదము ఆదిలో ఒక లోహపు మూస లేదా ఒక ముద్ర ద్వారా చేయబడు అచ్చు వలె "ఒక పిడిగుద్దు" మరియు "పిడిగుద్దు యొక్క పరిణామము" అనే అర్థమిచ్చింది.[11] పిల్లలు వారి తలిదండ్రుల మాదిరులు (*tupoi*) - *tupo* లేక, "నమూనా" యొక్క బహువచనము – అని పిలువబడ్డారు. మోషేకు చూపింపబడిన నమూనా కంటికి కనబడుచుండినదై యుండింది (నిర్గమకాండము 25:40). ఆయన "ముందున్న పరలోక సంబంధమైన మూల విషయమును ... పరిశుద్ధ స్థలము యొక్క కొలతలకు సరిపడు నమూనా యొక్క నకలును" చూచియుండవచ్చు.[12] Philo

చెప్పుచున్నట్టుగా, మోషే "సంపూర్ణసిద్ధి నొందజేయబడనై యుండిన శరీరముల యొక్క (అభౌతికమైన) నమూనాను తన ఆత్మతో సుదీర్ఘంగా ఆలోచించాడు."[13] గుడారము గూర్చిన ఆత్మసంబంధమైన అర్థమును అధ్యయనము చేయడం ద్వారా, పరలోకమే ఎలా ఉంటుందో మనము ఎంతో కొంత నేర్చుకొనగలమనే అర్థాన్ని ఇది కచ్చితంగా చూపించుచున్నది. పరలోకమందు దేవుని నమూనా, మోషే చేత చూడబడినట్టుగా, అది గుడారము గూర్చి ఆచారబద్ధమైన సంక్షిప్త వర్ణనతో కూడిన ఆయన ప్రణాళికయై యుండెను. ఈ విధంగా అది సంఘము ఏమైయుండవలెనో అని చెప్పుకోడానికి ఒక సంకేతమయ్యింది, సంపూర్ణ అవగాహన చొప్పున, అది పరలోకమునకు మాదిరియై యుండింది. సంఘమును గూర్చిన చర్చలలో భౌతిక కట్టడము గూర్చిన ప్రస్తావన లేదు. ఇహలోకమందలి సంఘము "మనమిప్పుడు ఆయనతో కూడ కూర్చుండియున్న పరలోక సంబంధమైన స్థలములకు" సమానమై యున్నది (ఎఫెసీయులకు 1:3; 2:6; హెబ్రీయులకు 9:23 చూడుము).

## ఆయన నూతన నిబంధన (8:6-13)

యేసు పరిచర్య సకల పరిచర్యల కంటె ఉన్నతమైనదై యుండింది ఎందుకనగా ఆయన సమస్త నిబంధనలలో ఉన్నతమైన నిబంధనకు, క్రొత్త నిబంధనకు మధ్యవర్తి అయ్యాడు. పాత నిబంధన సామాన్యంగా "పరలోక సంబంధమైన విషయాలకు ఒక నకలు మరియు ఛాయయై యుండింది." అది ప్రామాణికమైనదై మరియు దేవుని రూపకల్పన ప్రకారమైనదై యుండింది, కాని క్రీస్తు మరణించిన నాటి నుంచి పరిణమించనై యుండిన క్రొత్త నిబంధనను సూచించుట దాని సర్వోచ్ఛమైన పనై యుండింది.

క్రొత్త నిబంధన యొక్క ప్రాథమిక లక్షణములను హెబ్రీయులకు 8:6-13 మన ముందుంచుచున్నది. అవేమిటి?

### శ్రేష్ఠమైన వాగ్దానములతో కూడిన నిబంధన (8:6, 7)

**6ఈయనయైతే ఇప్పుడు మరియెక్కువైన వాగ్దానములనుబట్టి నియమింపబడిన మరి యెక్కువైన నిబంధనకు మధ్యవర్తియైయున్నాడు గనుక మరి శ్రేష్ఠమైన సేవకత్వము పొందియున్నాడు. 7ఏలయనగా ఆ మొదటి నిబంధన లోపములేనిదైతే రెండవదానికి అవకాశముండనేరదు.**

**వచనము 6.** మొదటిగా, ఈ క్రొత్త **నిబంధన మరి యెక్కువైన వాగ్దానములుగలదై** యుండింది. ఈ వచనము ప్రత్యేకమైన ప్రాముఖ్యతగలదై యున్నది, ఏలయనగా అది హెబ్రీ పత్రికలోని కీలకమైన మొదటి ప్రధానాంశమును ముగించుచున్నది: క్రొత్త నిబంధన, యేసు రక్తం చేత ప్రతిష్ఠింపబడినది, పాత నిబంధనకు అతీతమైనదై యున్నది మరియు దాని స్థానమును తీసికొనుచున్నది. క్రొత్త నిబంధన గూర్చిన చర్చను కొనసాగిస్తూ, ఈ "క్రొత్త నిబంధన" గూర్చి తెలియజెప్పుచుండిన పాత నిబంధనలోని ఒకే ఒక్క వాక్యభాగమును, యిర్మీయా 31:31-34ను రచయిత ఉల్లేఖించాడు.

మన మధ్యవర్తి, యేసు క్రీస్తు, "మరి శ్రేష్ఠమైన నిబంధనను" "మరి శ్రేష్ఠమైన వాగ్దానములతో కూడ" సమకూర్చాడు. మొదటి నిబంధన ప్రకారము అర్పింపబడిన జంతువులకు అతీతమైన ఒక ప్రాణము అర్పింపబడుట ద్వారా అది ఆమోద ముద్ర

వేయబడింది. ప్రభువైన యేసు **మరి యెక్కువైన నిబంధనకు మధ్యవర్తియై** యున్నాడని రుజవు చేయడానికి హెబ్రీ పత్రిక రచయిత హేతుబద్ధమైన తర్కమును మరియు లేఖనములను ప్రయోగించాడు. KJV (*diathēkē*) "నిబంధన" అని అర్థమిచ్చు మాట హెబ్రీయులకు 9:16, 17 మరియు మత్తయి 26:28లోను "శాసనము"/ "నిబంధన" అని అనువదింపబడింది. ఇవ్విధమైన ప్రయోగము నుంచి, మనకు "క్రొత్త నిబంధన" అనే బిరుదు ప్రాప్తించుచున్నది. "క్రొత్త" నిబంధన అనే భావనకు యిర్మీయా 31 ఒక కీలకమైన నేపథ్యమై యున్నది.

"మధ్యవర్తి" (*mesitēs*) అనే మాట "మధ్యలో" నిలువబడినవానిని సూచించడానికి మొదటి శతాబ్దములోని అనుదిన వ్యాపార వ్యవహారాల్లో ఉపయోగింపబడింది. ఇటువంటి వాడు ఒక పంచాయితీదారు, ఇరువురికి నడుమ ఉండేవాడై యుండెను.[14] మోషే పాత నిబంధన ప్రకారం మధ్యవర్తిగా పనులు చేసాడు (గలతీయులకు 3:19 చూడుము), కాని మనకు ఈనాడు యేసు క్రీస్తు ఒకే ఒక్క మధ్యవర్తియై యున్నాడు (1 తిమోతి 2:5). మనము తండ్రి యొద్దకు చేరడానికి పరిశుద్ధులు, మరియు దేవదూతలు, లేక యింకెవరైనా సరే, వీరి ద్వారా వెళ్లనవసరము లేదు!

**వచనము 7.** క్రీస్తు పరిచర్య, క్రొత్త నిబంధన, సంఘము, మరియు నిజమైన క్షమాపణతో సహా, "పరలోక సంబంధమైన విషయాలకు" సంబంధించినదై యున్నది (వచనము 5). పాపము గూర్చి పాత నిబంధన ఎక్కువగా తెలియజెప్పింది, కాని సంపూర్ణ లేక యథార్థమైన పాప విమోచనను అది సమకూర్చలేకపోయింది. ఈ హేతువునుబట్టియే ధర్మశాస్త్రము **లోపములేనిది** కానిదై యుండింది (రోమీయులకు 8:3–4 చూడుము). యేసు "మరి శ్రేష్ఠమైన" సేవలనందిస్తున్నాడు. సంబంధిత మెరుగుదలలు 8:8–12లో వర్ణింపబడియున్నవి. క్రొత్త నిబంధన నిజమైన మన్నింపును కలుగజేయుచున్నది, అయితే పాత నిబంధన క్రతువుల ప్రకారమైన పవిత్రతను కలుగజేసింది. పాత నిబంధనలోని వాగ్దానములు ఈ జీవితము మట్టుకే సరిపడినవై యుండినవి, కాని క్రొత్త నిబంధన వాగ్దానములు భవిష్యత్ జీవితమునకు చాలినవై యున్నవి. విధేయులైనవారికి, పాత నిబంధన దేశంలో దీర్ఘాయుష్షు, జనాభా పెరుగుదల. సమృద్ధియైన కోత, జాతీయ ప్రత్యేకార్హతలు, సమాధానము, మరియు సౌభాగ్యము గూర్చి హామీ ఇచ్చినది. అన్నిటిని మించి, క్రొత్త నిబంధన నిత్య జీవమును సమకూర్చుచున్నది, దీని గూర్చి పాత నిబంధన కేవలము ఒక సూచనను మాత్రమే సూచించినది. పాత నిబంధన "లోపములేనిదై" యుండినట్లయితే మనకు క్రొత్తది మరియు మరి శ్రేష్ఠమైన నిబంధన అవసరమయ్యేది కాదు.

### ఉల్లంఘించబడిన నిబంధనవంటి నిబంధన కాదు (8:8, 9)

**8అయితే లేనిదైతే రెండదానికి అవకాశముండనేరదు. అయితే ఆయన ఆక్షేపించి వారితో ఈలాగు చెప్పుచున్నాడు**

**–ప్రభువు ఇట్లనెను –ఇదిగో యొక కాలము వచ్చుచున్నది.**
**అప్పటిలో ఇశ్రాయేలు ఇంటివారితోను**
**యూదా ఇంటివారితోను**

**నేను క్రొత్తనిబంధన చేయుదును.**
**[9]అది నేను ఐగుప్తుదేశములోనుండి**
**వీరి పితరులను వెలుపలికి రప్పించుటకై**
**వారిని చెయ్యి పట్టుకొనిన దినమున**
**వారితో నేను చేసిన నిబంధనవంటిది కాదు.**
**ఏమనగా–వారు నా నిబంధనలో నిలువలేదు**
**గనుక నేను వారిని అలక్ష్యము చేసితినని**
**ప్రభువు చెప్పుచున్నాడు.**

**వచనము 8.** రెండవదిగా, **క్రొత్త నిబంధన** దేవుని ప్రజలు ఉల్లంఘించినటువంటి పాత నిబంధనను పోలి యుండదు. యూదులైన విశ్వాసులకు రచించు రచయిత వారి సొంత పరిశుద్ధ లేఖనములలోని ఉల్లేఖనము కంటె యింకా ఎక్కువ ఒప్పింపును కలుగుజేయు తర్కమును ఉపయోగించి యుండడు. ధర్మశాస్త్ర ప్రకారముగా తన ప్రజలు ప్రదర్శించిన విశ్వాసఘాతుకము సీనాయి పర్వతముపై చేయబడిన నిబంధన యొక్క తృణీకారమై యుండినదని యిర్మీయా పరిగణించాడు. దేవుడు నియమమును గూర్చిన ఈ తృణీకారమే ఇశ్రాయేలీయులు ఒక జనాంగముగా అంతమగుటకు ఒక ప్రాథమిక హేతువై యుండినదని యిర్మీయా గుర్తించాడు. సహజంగానే, ధర్మశాస్త్రము అసంపూర్ణమైనదై యుండునట్టుగా దేవుడు దానిని రూపొందించాడు, మరియు ఆయన దానిలో గల లోపమును సూచించాడు; కాని ఆయన ప్రాచీన ఇశ్రాయేలు ప్రజల్లో ఉండిన లోపమును సహితము కనుగొన్నాడు.

**ఇశ్రాయేలు ఇంటివారికిని** మరియు **యూదా ఇంటివారికిని** ఒక క్రొత్త నిబంధన ఇవ్వబడింది; వారు ఒక్క జనాంగముగా మరొక పర్యాయము ఐక్యము కావలసి యుండింది. సంఘము, ఒక్క శరీరము (ఎఫెసీయులకు 2:14–16) నెలకొల్పబడిన సందర్భములో ఇది సంభవించినది. దేవుడు విభజనలను కోరడం లేదు; ఆయన జనులందరును ఒక్క శరీరముగా, ఒక్క సంఘముగా (ఎఫెసీయులకు 1:22, 23), "ఆత్మసంబంధమైన ఇశ్రాయేలుగా" (గలతీయులకు 6:16) ఉండవలెననే ఆయన ఆశిస్తున్నాడు. కలహాలతో కూడిన కక్షలు తగవులను మరియు ద్వేషబావమును సృష్టించుననియు, సాతానును సేవిస్తూ లోకము క్రీస్తునంగీకరించుటకు విరోధముగా గొప్ప ప్రతిబంధకమును సృష్టించుననే విషయం ఆయనకు తెలియును (యోహాను 17:20–21 చూడుము). క్రొత్త[15] నిబంధన సకల కలహాలతో కూడిన కక్షలను మరియు మత విభేదములను నిర్మూలించుటకు ఉద్దేశింపబడినది. పాత నిబంధనలో లోపములున్నవని ఒక క్రొత్త నిబంధన ప్రవచింపబడిందనే వాస్తవమే రుజువుచేసినది; పాత నిబంధన సంపూర్ణమైనదై యుండినట్లయితే క్రొత్త నిబంధనను ఇచ్చుటలో అర్థముండదు.

క్రొత్త నిబంధన గూర్చిన వాగ్దానము యిర్మీయా ద్వారా ఇవ్వబడిందనే వాస్తవమును 8వ వచనం దాటిపోతున్నది మరియు ఈ ఉల్లేఖనమును దీనికి బదులుగా మూల ఆధారమునకు – ప్రభువునకు – ఆపాదిస్తుంది. ఆయన చెప్పుచున్నాడు అనే మాటలు గ్రీకు గ్రంథ పాఠంలో నిర్దిష్టముగా చెప్పబడలేదు, కాని దేవునిని ప్రతినిధిగా ప్రస్తావించుట రచయితకు మామూలు వాడుకయై యుండింది. యిర్మీయా 31:31–34లోని ప్రవచనము,

హెబ్రీయులకు 8:8-12లో ఉల్లేఖింపబడిన ప్రవచనము, యూదా ఇంటివారు చెరలో ఉన్నప్పుడు బబులోను నియంత పరిపాలనలో వారు శ్రమనొందుచుండిన సందర్భంలో పలుకబడింది. అసలు వారు ఎప్పటికైనా తమ సొంత దేశానికి మరలా వెళ్లగలుగుదురా అని ప్రజలు భయాందోళనలతో అబ్బురపడుచుండిరి. కాని వారికి నిరీక్షణ కలుగజేయబడింది (యిర్మీయా 31:17); ఏలయనగా వారు తమ సొంత గూటికి తిరిగి వచ్చుట మాత్రమే కాదు, కాని వారు ఒక క్రొత్తది మరియు మరి శ్రేష్ఠమైన నిబంధన పొందుదురు.

ధర్మశాస్త్రమును పునఃరుద్ధరించడానికి రాజైన యోషీయా సహితం తనను తాను అంకితం చేసుకొనుచుండగా (2 రాజులు 23:3), ప్రజలు మాత్రం నీతిమంతమైన అతని మాదిరిని అనుసరింపకుండిరని యిర్మీయా తెలుసుకున్నాడు (యిర్మీయా 3:6-10). దేశములోని సమస్త ప్రజలు మారుమనస్సు నొందని తరుణంలో, ప్రజలతో వ్యవహరించడానికి క్రొత్త నిబంధన భిన్నమైన మార్గమును చూపిస్తుంది. ధర్మశాస్త్రమును అనుసరించుటలో ప్రదర్శింపబడు వైఫల్యము యొక్క సారాంశమును దేవుడు దానిలో పొందుపర్చాడు (రోమీయులకు 8:3-4); కాబట్టి, ధర్మశాస్త్రము కోరుచుండిన ప్రకారం సంపూర్ణమైన జీవితం జీవించడంలోని యూదుల సొంత వైఫల్యం విషయంలో వారి చరిత్ర యూదులను ప్రభావితం చేయవలసి యుండింది.

క్రొత్త నిబంధన “ఇశ్రాయేలు ఇంటివారితోను” మరియు “యూదా ఇంటివారితోను” చేయబడుతుంది. లేఖనముల ప్రకారం “ఇశ్రాయేలు” అనే పదం నాలుగు విధానాల్లో అన్వయింపబడుతుంది.[16]

1. దేవుని యువరాజుగా యాకోబునకు (ఆదికాండము 32:28).
2. యాకోబు వంశస్థులందరికి (నిర్గమకాండము 4:22).
3. యరోబాము అధికారము క్రింద తిరుగుబాటు చేసిన పది గోత్రములకు (1 రాజులు 12:19, 20).
4. క్రొత్త నిబంధన ప్రకారం ప్రతి క్రైస్తవునికి (రోమీయులకు 9:6; గలతీయులకు 6:16). ఈ నిబంధన ఇశ్రాయేలీయులందరికి (యూదులందరికి) ఇవ్వబడుతుంది, కాని అది దానిని అంగీకరించిన సకల జాతులకును మరియు జనాంగములకును ఇవ్వబడుతుంది.

క్రొత్త నిబంధన ప్రకారం “ఇశ్రాయేలు ఇంటివారు” అనేది “దేవుని ఇశ్రాయేలు”గా అయ్యింది (గలతీయులకు 6:16). ఇందులో సకల మానవులు కలుపబడవచ్చు, అయితే ఈ విషయం హెబ్రీ పత్రికలో ఎచ్చటను నిర్దిష్టముగా చెప్పబడలేదు. క్రైస్తవులైన యూదులలో యింకను మిగిలి యుండిన పూర్వాభిప్రాయములను రచయిత ఎరిగియుండినందు వలన ఆయన కచ్చితంగా చెప్పకుండుట సాధ్యమే. క్రొత్త నిబంధనను స్థాపించడానికి ఆయన రక్తము చిందింపబడవలసి యుండినదని యేసు సెలవిచ్చాడు (మత్తయి 26:28). అటుతరువాత, ఈ విషయము భూలోకమందంతటను ప్రచురము చేయబడవలెనని ఆయన ఘోషించాడు (లూకా 24:46, 47; మార్కు 16:15; మత్తయి 28:18-20).

“యూదా” అనే మాట “స్తుతి” లేక “ఆయన స్తుంపబడును” అనే అర్థమిస్తుంది.

ఈ మాట మొట్టమొదట యాకోబు కుమారుని విషయంలో లేయా చేత పలుకబడింది (ఆదికాండము 29:35); అటుతరువాత ఆయన వంశస్థులందరికి, లేదా అతని గోత్రము విషయంలో (సంఖ్యాకాండము 1:7); అటు పిమ్మట సిమియోను మరియు దాను గోత్రములలో నుంచి కొందరితో, యూదా మరియు బెన్యామీను గోత్రములతో సహా, రెహబామును అనుసరించినవారి విషయంలో పలుకబడింది. చెర తరువాత, "యూదుడు" ("*Ju*-dah" లో నుంచి పుట్టిన పదము) అని ఇశ్రాయేలీయులలోని ఏ గోత్రమునకు చెందినవాడైనను, మరియు అన్యమతావలంబికులు సహితం పిలువబడ్డారు. యిర్మీయా పలికిన ప్రవచనములోని వ్యక్తీకరణము సామాన్యముగా దేవుని జనులందరికిని, క్రొత్త నిబంధనకు విధేయులై దేవునితో సంబంధమును నెలకొల్పుకొనిన వారినందరిని సూచించినది.

**వచనము 9.** దేవుడు (ఇశ్రాయేలు) **చెయ్యి పట్టుకొనిన దినమున పాత నిబంధన** ఇవ్వబడింది. ఇచ్చట ప్రయోగింపబడుతున్న భాష ఒక తండ్రి తన చిన్న కుమారుని చెయ్యి పట్టుకొని నడిపిస్తున్న పటమును చిత్రీకరిస్తుంది. ప్రజలు బలహీనులై యుండిరి మరియు దేవుడు, "తన చెయ్యిని వారి చేతుల్లో పెట్టి, వారిని పట్టుకొని *ఐగుప్తు దేశములో* నుండి, వారు బందీలై యుండిన దేశంలో నుంచి *వెలుపలికి నడిపించినట్లుగా*" అంతవరకు వారు ఐగుప్తు దేశంలో నుంచి వెలుపలికి రాలేకపోయారు.[17] దేవుడు తన ప్రజలకు వారి ఆత్మసంబంధమైన పురోభివృద్ధికి ఆ సమయంలో ఆదర్శవంతముగా సరిపడు ఒక విధానమును ఇచ్చాడు. మొదట, పాపపు స్వభావము గూర్చిన అవగాహన వారికి అవసరమయ్యింది. పాత నిబంధన పాపమనగా ఏమితో తేటతెల్లము చేసింది, కాని ధర్మశాస్త్రము వలన ఏ ఒక్కరును నీతిమంతులుగా తీర్చబడలేకపోయిరి లేదా రక్షింపబడలేకపోయిరి (రోమీయులకు 3:20; గలతీయులకు 3:19-21 చూడుము). పాపులను రక్షించుటకు అసమర్థవంతమైనదై పాపిష్ఠియైన మానవుని ప్రగాఢమైన అవసరమును తీర్చుటలో ధర్మశాస్త్రము విఫలమయ్యింది.

దేవుడు ఇశ్రాయేలీయులను తప్పుపట్టాడు ఎందుకనగా వారు ఆయన నియమమును ఎడతెరిపిలేకుండా ఉల్లంఘించుచుండిరి: "వారు నా నిబంధనలో నిలువలేదు." పాత నిబంధన విషయంలో కూడ ఆయన తప్పుపట్టాడు ఎందుకనగా అది ఎడతెరిపిలేకుండా ఖండించింది. తన ప్రజలు భయభీతిని గొలుపు దోషభావ భారమును ఎల్లప్పుడు మోయుచుండవలెనని దేవుడు కోరలేదు, అట్లయినను దోషభావము పాత నిబంధనుఅట్టి అవసరమైన పరిణామమై యుండింది. ఇది మానవాళిని ఒక మహమ్మారి వలె ఆవరించకూడదని దేవుడు ఆశించాడు కాబట్టి, ఆయన పాత నిబంధన స్థానంలో క్రొత్త నిబంధనను ఏర్పాటుచేయాల్సి వచ్చింది. కాబట్టి, పాత నిబంధన, దేవుని నిత్య ప్రణాళిక కాదు. క్రొత్త నిబంధన పాత నిబంధన వంటిదై యుండదు.

**గనుక నేను వారిని అలక్ష్యము చేసితిని** అని దేవుడు సెలవిచ్చినప్పుడు, వారు ఆయన నిబంధనను తృణీకరించిన దానికి అదొక స్వాభావికమైన పర్యవసానమై యుండింది. ఇశ్రాయేలీయులను రక్షించుటలో దేవుని ఆందోళన లేదా ఆసక్తి కొరవడిందని ఈ ప్రకటన సూచించుట లేదు. ఏది ఏమైనా, వారు ఆయనను బొత్తిగా విడిచిపెట్టినప్పుడు ఆయన ప్రజల విషయమై పట్టించుకొనడు (రోమీయులకు 1:18, 24, 26, 28 చూడుము).

**మనస్సులలోను, హృదయములలోను లిఖింపబడిన నిబంధన (8:10-12)**

**10ఆ దినములైన తరువాత**
**ఇశ్రాయేలు ఇంటివారితో**
**నేను చేయబోవు నిబంధన యేదనగా,**
**వారి మనస్సులో నా ధర్మవిధులను ఉంచెదను**
**వారి హృదయములమీద వాటిని వ్రాయుదును**
**నేను వారికి దేవుడనై యుందును**
**వారు నాకు ప్రజలై యుందురు.**
**11వారిలో ఎవడును**
**-ప్రభువును తెలిసికొనుడని**
**తన పట్టణస్థునికైనను తన సహోదరునికైనను**
**ఉపదేశముచేయడు**
**వారిలో చిన్నలు మొదలుకొని పెద్దల వరకు**
**అందరును నన్ను తెలిసికొందురు.**
**12నేను వారి దోషముల విషయమై దయగలిగి**
**వారి పాపములను ఇంకను ఎన్నడును జ్ఞాపకము చేసికొననని**
**ప్రభువు సెలవిచ్చుచున్నాడు.**

**వచనము 10.** మూడవదిగా, ఈ క్రొత్త నిబంధన దేవుని ప్రజల హృదయములపై వ్రాయబడుతుంది: **వారి మనస్సులో నా ధర్మవిధులను ఉంచెదను, వారి హృదయముల మీద వాటిని వ్రాయుదును.** తన నియమములను "వారి మనస్సుల్లో" ఉంచుచు, "వారి హృదయముల మీద" వ్రాయుట ద్వారా, వారు పాత నిబంధనను చాలా వరకు కంఠస్థం చేసినప్పటికిని (ద్వితీయోపదేశకాండము 6:6-9), క్రొత్త నిబంధనను కంఠస్థం చేయవలెనని దేవుడు చెప్పడం లేదు. కొందరు, దావీదు వలె, దానిని వారి హృదయములో ఉంచుకొని యుండిరి (కీర్తనలు 119:11). లేఖనములను కంఠస్థం చేసినంత మాత్రాన నీవు వాటికి విధేయుడవై యున్నావను హామీ ఇవ్వదు, అయితే కంఠస్థం చేయడం నిశ్చయంగా ఎంతో ప్రయోజనకరమైనదై యుంటున్నది. నియమములను "హృదయములో ఉంచుకొనుట" అనగా, నిజానికి, హృదయము ఒక నూతనమైన చిత్తవృత్తిని కలిగియుండుట యని అర్థమిచ్చుచున్నట్టు అగుపిస్తుంది. దేవుని నియమములను వాని హృదయములో ఉంచుకొనువాడు వాటి యందు ఆనందిస్తాడు (కీర్తనలు 1:1-3) మరియు వాటికి లోబడవలెనని ఆశిస్తాడు; వాడు దేవుని చిత్తమును ప్రేమిస్తాడు. క్రొత్త నిబంధనను అర్థం చేసుకొనకుండా మరియు దానిని వాని హృదయపూర్వకంగా విశ్వసించకుండా ఒకడు ఈ నిబంధన క్రిందికి రాజాలడు.

పాత నిబంధన విషయంలో, పిల్లలు దానిని మరియు దానిని ఇచ్చిన దేవుని తెలిసికొనునట్లు వారికి బోధింపవలసి యుండింది. దేవుడు నిబంధన చేసిన వారిలో సహితం కొందరు ఆయన ఉపదేశములను ఎన్నడును వారి హృదయములలో ఉంచుకొనలేదు. వారు అభివృద్ధి చేసుకొనవలెనని పౌలు ఫిలిప్పీ పట్టణములో ఉండిన క్రైస్తవులను కోరినటువంటి,

ఒక నిశ్చయమైన వైఖరి కలిగియుండవలసిన అవసరతను ఇది సూచించుచున్నది: "క్రీస్తు యేసుకు కలిగిన ఈ మనస్సు మీరును కలిగియుండుడి" (ఫిలిప్పీయులకు 2:5-11). క్రైస్తవులు క్రీస్తు ప్రదర్శించిన లోబడు వైఖరిని కలిగియుండవలెను. ఈ నూతన చిత్తవృత్తి మూలమున, క్రొత్త నిబంధన క్రింద నున్నవారు దానికి లోబడవలెనని ఆశిస్తారు. మనము లోబడునప్పుడు, ఈ నిబంధన మనకు మరింత ప్రశస్తమైనదవుతుంది. పరిపక్వమైన క్రైస్తవుడు లోబడక తప్పదు అని బలవంతముగా కాదు కాని ఈ నిబంధన యెడల వానికి గల ప్రేమనుబట్టి వాడు దీనికి లోబడును. అది వాని స్వభావములో ఒక భాగమవుతుంది; అది వాని హృదయములోనే నాటబడుతుంది.

నూతన హృదయము లేక ఆత్మ గూర్చిన భావము యెహెజ్కేలు గ్రంథంలో కూడ కనబడుతుంది (యెహెజ్కేలు 11:19, 20 చూడుము). నిబంధనను ఇవ్విధంగా కలిగియుండువాడు దానికి పూర్తిగా లోబడునని ఇచ్చటి గ్రంథ పాఠము యొక్క అంతర్భావమై యున్నది. ఈ ఆలోచన యూదులు బబులోను చెర నుంచి తిరిగి వచ్చిన, సందర్భముతో సంబంధంగలదై యున్నది. ఇశ్రాయేలీయులు ధర్మశాస్త్రమును పాటించుదురని వాగ్దానం చేసారు (నిర్గమకాండము 24:7), కాని వారి సదుద్దేశములకు సరిపడునట్లుగా, వారు తమ హృదయములోని నైతిక శక్తిని ఆచరణలో పెట్టలేదు.[18] వారిలో "శరీరమును అనుసరించుచుండిన" బలహీనత ప్రజలమై యుండింది (రోమీయులకు 8:3, 4). దావీదు దేవుని నియమమును తన హృదయములో ఉంచుకొనినప్పటికిని (కీర్తనలు 119:11), దానిని సంపూర్ణముగా పాటించుటలో అతడు విఫలుడయ్యాడు. కాబట్టి, ఈ అభివ్యక్తము ధర్మశాస్త్రమును కేవలము "హృదయములో" ఉంచుకొనుటను మించినదై యున్నదని అర్థమిచ్చుచున్నది.[19] కొండ మీది ప్రసంగములో పాత నిబంధనలో గల దేవుని తాత్పర్యము గూర్చి తన శిష్యులకు సరైన అవగాహనను సమకూర్చవలెనని యేసు ప్రయత్నించుచుండెను. వారు రాజ్యములో ప్రవేశించాలంటే వారి నీతి బాహ్యమైనది, సాంప్రదాయికమునైన శాస్త్రులు మరియు పరిసయ్యుల నీతి కంటె అధికమైనదై యుండవలసి యుండింది (మత్తయి 5:20).

దేవుని క్రొత్త నిబంధనకు లోబడవలెనని ఒకని హృదయములో గల సంపూర్ణమైన నిబద్ధత ద్వారా "శక్తి" లభిస్తుంది. ఒక శిశువు తన తల్లి పాల కొరకు అపేక్షించునట్లుగా, దేవుని వాక్యమును వాంఛించుట ద్వారా, మరియు తద్వారా రక్షణలోనికి ఎదుగుట ద్వారా ఈ శక్తిని అధిక పరిమాణములో అభివృద్ధి చేసుకొనవచ్చు (1 పేతురు 2:1, 2).

**నేను వారికి దేవుడనై యుందును** అనగా, ప్రతి ఒక్కరు దేవుని యొద్దకు వ్యక్తిగతముగా రావచ్చు. పాత నిబంధన దేవునికిని ఆయన ప్రజలకును మధ్య చాలా ఎడమును కల్పించింది, ఇది గుడారములోని తెర చేత సోదాహరణంగా చిత్రీకరింపబడుచున్నది. క్రొత్త నిబంధన ప్రాకరం, మనము దేవుని యొద్దకు నేరుగా చేరుకొనవచ్చు, ఏలయనగా ఆయన మన దేవుడై యున్నాడు మరియు మనము ఆయన ప్రజలమై, ఆయన కుటుంబమై యున్నాము. పాత నిబంధన ప్రకారము, దాదాపుగా వాస్తవమైన వర్గీకరణ విధానం ఉండింది, దీని సహాయంతో యాజకులు సామాన్య ప్రజలను మించినవారుగా పరిగణింపబడిరి. పాత నిబంధన యాజకుని దృష్టిలో దేవుని రాజ్యములోని పౌరులందరు సమానులే.

ఒక విధంగా, ఇశ్రాయేలీయులు దేవుని ఎరిగియుండిరి ఎందుకనగా ఆయన తనను తాను వారికి బయలుపర్చుకున్నాడు. "నేను వారికి దేవుడనై యుందును, వారు నాకు

ప్రజలై యుందురని" ఆయన సెలవిచ్చాడు. దేవుడు కోరిన విషయాలను తృణీకరించుట, లేదా వాటిని పాటించకుండుట, దేవుని ఎరుగని పరిస్థితితో సమానముగా ఎంచబడింది (న్యాయాధిపతులు 2:10 చూడుము). దేవుని ఎరిగి యుండుట అనగా ఆయనను "వారి ఆలోచనకర్త, వారి కాపుకర్త, వారి విమోచకుడు, వారి మార్గనిర్దేశకుడుగా" గుర్తించుటయై యున్నది.[20] ప్రజల దుర్నీతిమయమైన జీవిత విధానము దేవుని ఎరుగకుండుటకు సమానమని హోషేయ ఎంచాడు (హోషేయ 4:1–3). క్రొత్త నిబంధన ప్రకారం ఇదే సూత్రము వాస్తవమైయున్నది. పాపిష్ఠి జీవిత విధానం "క్రీస్తును చాలినంతగా నేర్చుకొనని స్థితిగా" వర్ణింపబడింది:

> అయితే మీరు యేసునుగూర్చి విని, ఆయనయందలి సత్యము ఉన్నది ఉన్నట్టుగానే ఆయనయందు ఉపదేశింపబడినవారైనయెడల, మీరాలాగు క్రీస్తును నేర్చుకొన్నవారుకారు. కావున మునుపటి ప్రవర్తన విషయములోనైతే, మోసకరమైన దురాశలవలన చెడిపోవు మీ ప్రాచీనస్వభావమును వదలుకొని మీ చిత్తవృత్తియందు నూతనపరచబడినవారై, నీతియు యథార్థమైన భక్తియుగలవారై, దేవుని పోలికగా సృష్టింపబడిన నవీనస్వభావమును ధరించుకొనవలెను (ఎఫెసీయులకు 4:20–24).

ఎఫెసీయులు తమ సొంత హృదయములను మార్చుకొనుట వారి కర్తవ్యమై యుండింది! వారు క్రీస్తును గూర్చి నేర్చుకున్న దానిని సరిగా గ్రహించి దానిని అన్వయించుకొని యుండినట్లయితే, వారు "నూతనపరచబడిన చిత్తవృత్తి" కలిగియుండెడివారే (4:23). తేటగా, ఇటువంటి స్ఫూర్తిని వారు ఇదివరకే కలిగియుండినట్లయితే, వారు దానిని పునఃప్రజ్వలింపజేసుకొనవలెను. ఎఫెసీయులకు 5:18లో గల ఆజ్ఞకు లోబడుట ద్వారా ఇది చేయనగును: "మరియు మద్యముతో మత్తులై యుండకుడి, దానిలో దుర్వ్యాపారము కలదు, అయితే **ఆత్మ** పూర్ణులై యుండుడి." హృదయపూర్వకముగా దేవుని ప్రేమించువాడు, పాపము చేయుట వలన వాడు ఆయన మనస్సును గాయపర్చగోరడు.

**వచనము 11. వారిలో ఎవడును, 'ప్రభువును తెలిసికొనుడని' తన పట్టణస్థునికైనను, తన సహోదరునికైనను ఉపదేశము చేయడు.** క్రొత్త నిబంధన ప్రకారం నడుచుకొనగోరువాడు యథార్థముగా క్రీస్తు నంగీకరించినవాడై యుండవలెను, అయితే ఒక శిశువు పాత నిబంధన లోనికి శరీర రీతిగా జన్మించినది. ఈ విధంగా పాత నిబంధనను అనుసరించుట వ్యక్తిగత నిబద్ధత కంటె ఎక్కువగా కుటుంబ లేక జాతీయ వాడుకయై యుండింది. పాత నిబంధన ప్రాథమికంగా ఇశ్రాయేలు ప్రజల కొరకు ఉద్దేశింపబడింది, కాని క్రొత్త నిబంధన యూదులైనను లేదా అన్యజనులైనను, సమస్త జనులకు ఉద్దేశింపబడినదై యున్నది. ఒక బిడ్డ తన తలిదండ్రుల విశ్వాసమునుబట్టి పరలోక రాజ్యములో ప్రవేశించగలదనే తప్పుడు అభిప్రాయం కొందరిలో కలదు. తలిదండ్రులు తమ బిడ్డలకు "బాప్తిస్మము" ఇప్పించవచ్చు (సాధారణంగా చిలకరింపు విధానం), తత్ఫలితంగా ఆ బిడ్డ క్రీస్తునంగీకరించవలసిన లేదా లోబడవలసిన అవసరతను ఎన్నడు తెలుసుకొనకపోవచ్చు. పాత నిబంధన క్రింద పుట్టినవాడు దేవుని తెలిసికొనుట గూర్చి నేర్పింపబడవలసి యుండింది (వచనము 11). క్రొత్త నిబంధన ప్రకారం ఈ విధానం తిరగబడింది! "విశ్వాసముతో వినుట" ద్వారా ఒకడు దేవుని తెలిసికొనును (గలతీయులకు 3:2). "క్రొత్తగా జన్మించుట" ద్వారా ఏర్పడు వ్యక్తిగత విశ్వాసము మరియు విధేయత అవసరమైయున్నవి, దీనితోపాటు "నీటి మూలముగాను

మరియు ఆత్మ మూలముగాను" జన్మించుట ఆవశ్యకమై యున్నది (యోహాను 3:5; 1 పేతురు 1:23; 1 కొరింథీయులకు 4:15 చూడుము). హెబ్రీయులకు 8:8-12 దాదాపుగా సందర్భవశాత్తు మరియు సార్థకముగా, చంటిబిడ్డల బాప్తిస్మము క్రమవిరుద్ధమని త్రోసిపుచ్చుచున్నది ఎందుకనగా ఇట్టి వాడుక మరొక పర్యాయం క్రొత్త నిబంధనను పాత నిబంధన చేయుచున్నది, దీని ప్రకారం ఒకడు నిబంధన క్రింద జన్మించి, "ప్రభువుని తెలిసికొనవలెనని" అటుతరువాత నేర్పింపబడవలసిన పరిస్థితి ఏర్పడుతుంది. క్రైస్తవ యుగంలో, సువార్తను అర్థం చేసుకొని, క్రొత్త నిబంధన ప్రకారం జీవించడానికి దేవుని నియమములను లోబడుట ద్వారా ఒకడు "ప్రభువును తెలిసికొనవలెను." యేసునందు నమ్మకముంచుటకు మరియు మారుమనస్సు నొంది, క్రీస్తును ఒప్పుకొని, బాప్తిస్మమందు ఆయనతో కూడ పాతిపెట్టబడుట ద్వారా (రోమీయులకు 6:17, 18) సరైన "ఉపదేశ విధానమునకు" "హృదయపూర్వకముగా లోబడుటకు, దేవుడు కోరుచున్న విషయాలను అతడు తప్పక నేర్చుకొనవలెను.

**వారిలో చిన్నలు మొదలుకొని పెద్దల వరకు, అందరును నన్ను తెలిసికొందురు.** "ప్రభువును తెలిసికొనుడని" రాజ్యములో ఒకడు తన తోటి పౌరునికి నేర్పించనవసరము లేదు. "అందరును నన్ను తెలిసికొందురు" అని దేవుడు సెలవిచ్చాడు - లేదంటే, వారు క్రీస్తు రాజ్యములో ఉండరు. దేవుని చిత్తము మన హృదయములలోను మనస్సులలోను ఉపదేశము ద్వారా ఉంచబడి యున్నది. ఆయన ద్వారా దేవుని యొద్దకు వచ్చువారందరు మొదట నేర్పింపబడవలెనని యేసు సెలవిచ్చాడు (యోహాను 6:44, 45). "వాక్యమును వినుట వలననే" విశ్వాసము కలుగుతుంది (రోమీయులకు 10:17).

**వచనము 12**. పొందడానికి సాధ్యమయ్యే అత్యంత గొప్పదైన ఆశీర్వాదము ఇప్పుడు మనదే: **నేను వారి దోషముల విషయమై దయకలిగి వారి పాపములను ఇకను ఎన్నడును జ్ఞాపకము చేసికొనను.** నిజమైన క్షమాపణ, మొదటి నిబంధనలో కొరవడింది (హెబ్రీయులకు 9:9; 10:1, 2, 11). అది క్రతువుల ఉల్లంఘనలతో వ్యవహరించింది, కాని "హృదయము మరియు జీవితములోని పవిత్రతను అది ఎలా కలుగజేయగలిగింది?"[21] "పాత నిబంధన ప్రకారమైన బల్యర్పణలు పాపములను *జ్ఞాపకమునకు* తెచ్చినవి, కాని విమోచన కలుగజేయలేదు (హెబ్రీయులకు 10:1-3, 18)."[22] ఒకడు శిష్టాచారము ప్రకారం సరైనవాడై యుండవచ్చు కాని హృదయములో శుద్ధిలేనివాడై యుండవచ్చు, అట్లయినను ఇతరుల దృష్టిలో వాడు నీతిమంతుడుగానే పరిగణింపబడును (లూకా 18:9-14). ధర్మశాస్త్రము ప్రకారమైన సంస్కారాలు ఆత్మసంబంధమైన సత్యముల గూర్చి సరైన అవగాహనను కల్పించలేవు ఎందుకనగా దాని నిబంధనలు దేవుడు పాపమును సహించజాలడని చూపించుటకు ఉద్దేశింపబడినవై యుండినవి. అనేక మంది యూదులకు ఈ ఆచారకర్మకాండలు కేవలము శిష్టాచార క్రతువులయ్యాయి. ఇప్పుడు, పాపములు ప్రతి సంవత్సరము జ్ఞాపకము చేయబడుటకు బదులుగా (హెబ్రీయులకు 10:1, 2), మనము ప్రభు రాత్రి భోజన సంస్కారములో చిత్తశుద్ధితో పాల్గొనుట ద్వారా, మన పాపములు పూర్తిగా తొలగింపబడినవని ప్రతి వారము జ్ఞాపకము చేసుకొనుచున్నాము (మత్తయి 26:28). క్రీస్తునందు, దేవుడు మనమెన్నడును పాపము చేయలేదన్నట్టుగా మనలను ఆదరిస్తాడు. మనము మారుమనస్సు నొందుట వలన మన పాపములు క్షమింపబడలేదు,

ఇది పాత నిబంధన ప్రకారము సరైనదే, కాని క్రీస్తు యొక్క బలియాగము వలననే క్షమింపబడినవి (రోమీయులకు 8:33, 34). ఏది ఏమైనా, మారుమనస్సనేది ఇప్పుడును ఆవశ్యకమై యున్నది (లూకా 13:3, 5). క్రీస్తునందు, పశ్చాత్తాపముతో అంగీకరిపబడిన పాపము కడిపివేయబడుతుంది (1 యోహాను 1:7–10).

మనము చేసిన పాపములను దేవుడు మర్చిపోగలడా? అనగా ఆయన మన దోషముల రికార్డును శుభ్రముగా తుడిచివేయును గనుక వాటిని మనకు విరోధముగా ఇక మీదట ఎన్నటికిని మనముందుంచడు. "నేను నిన్ను క్షమిస్తున్నాను, కాని నీవు చేసిన దానిని నేనెన్నడును మర్చిపోనని" చెప్పేవాడు, దేవుడు క్షమించిన విధంగా క్షమించలేదని అర్థం.

**సదాకాలము వాడుకలో ఉండు నిబంధన (8:13)**

**13ఆయన క్రొత్తనిబంధన అని చెప్పుటచేత మొదటిది పాతదిగా చేసియున్నాడు. ఏది పాతగిలి ఉడిగిపోవునో అది అదృశ్యమగుటకు సిద్ధముగా ఉన్నది.**

**వచనము 13.** నాలుగవదిగా, ఈ క్రొత్త నిబంధన వాడుకలో లేకుండా ఎన్నటికిని అంతరించి పోదు. దేవుడు **క్రొత్తనిబంధనను** వ్యవస్థాపించినప్పుడు, మొదటి దానిని ఆయన **పాతదిగా చేసియున్నాడు. ఏది పాతగిలి ఉడిగిపోవునో అది అదృశ్యమగుటకు సిద్ధముగా ఉన్నది.**

మొదటి నిబంధన పాతదైపోయిందనియు దాని కాలం చెల్లిపోయిందనియు "క్రొత్త నిబంధన" అనే మాటలే బయలుపరచినవి. "పాతది" అనే పదమును పౌలు 2 కొరింథీయులకు 3:6, 14లో మొదటి నిబంధన గూర్చిన ప్రస్తావనలో ఉపయోగించాడు. మొదటి నిబంధనను "వాడుకలో లేని దానిగా చేయుట" అనగా అది "ఇక మీదట అవసరము లేనిదై యున్నదని" అర్థం, ఈ విషయం అది అదృశ్యమైనప్పుడు అందరికి తెలిసిపోతుంది. అదృశ్యమగుట అనేది సంభవింపనై యున్నది; పాత నిబంధన అది పాతగిలుట వలన కాలం చెల్లినదవుతుంది. NEB "పాతబడిపోవుచు వయస్సుమళ్లునదేదైనను త్వరలోనే అదృశ్యమవుతుంది" అని అర్థమిచ్చు మాటలు వ్రాయబడియున్నవి. "అదృశ్యమగుట" (*aphanismos*) అని అర్థమిచ్చు గ్రీకు మాటకు "కంటికి కనబడకుండా మాయమైపోవుట" అని అర్థమిచ్చు పదమే వాడబడింది, ఇది కంటికి కనబడి అంతలోనే కనబడకుండా పోయే నీటి ఆవిరి గూర్చి చెప్పబడుచున్న సందర్భములో యాకోబు 4:14లో ప్రయోగింపబడింది.

పాత నిబంధన సిలువకు కొట్టివేయబడింది. ఈ విషయాన్ని యేసు మత్తయి 5:17, 18లో సూచించాడు. "సమాప్తమైనది" అని ఆయన సిలువ మీద ఘోషించాడు (యోహాను 19:30), ఈ మాటలు, నా జీవితం ముగిసింది అనే భావమును మించిన అర్థాన్నిచ్చాయి. ఆయనకు ఇవ్వబడిన పనిని ఆయన "నెరవేర్చాడని" యేసు తన తండ్రితో యోహాను 17:4లో చెప్పాడు. మతపరముగా ఇవ్వబడి దేవుని చేత ఆమోదింపబడిన ఒక పద్ధతి, యూదా మతము క్రీస్తు మరణముతో అంతమయ్యింది.

ఏది ఏమైనా, దేవాలయమునకు సంబంధించిన విధానము ప్రాధాన్యమైనదిగాను మరియు చాలా కాలము పవిత్రమైనదిగాను ఎంచబడి, యూదా మతము ఇంకా నలుబది సంవత్సరముల వరకు కొనసాగునట్లు అనుమతింపబడింది. మానవ దృష్టికోణం చొప్పున,

రోమా సైన్యము రాతి మీద రాయి నిలువకుండ చేసినప్పుడు (మత్తయి 24:2), అది చివరకు క్రీ.శ. 70లో అంతమౌతుంది. దేవాలయము నాశనము చేయబడుతుందని యేసు ముందుగా తెలియజెప్పాడు (మార్కు 13:2), మరియు స్తెఫను దాని అంతము గూర్చి పలికాడు (అపొస్తలుల కార్యములు 6:14 చూడుము). నాశనము చేయబడిన ఈ దేవాలయము పునఃనిర్మింపబడుతుందనియు లేవీయ బల్యర్పణల విధానం పునఃరుద్ధరింపబడుతుందనియు క్రొత్త నిబంధనలో ఎటువంటి సూచనయైనను లేదు. ఇవి భూమి మీద నిలిచియుండకుండునట్లు ఎప్పటికి తొలగింపబడినవి. ఈనాడు నిలిచియున్న యూదా మతము యొక్క అవశేషం, లేక ఛాయ పాత నిబంధన యొక్క గుల్ల మాత్రమే అయియున్నది. దేవాలయము పునఃనిర్మింపబడుట అంటే, అది మనము క్రీస్తు ద్వారా విమోచింపబడిన క్రొత్త నిబంధన అంతటిని పడగొట్టడానికి చేయబడు ఒక ప్రయత్నమే అవుతుంది. అది మరి శ్రేష్ఠమైన దాని నుంచి తక్కువైన దాని వైపు కొనసాగు ఒక తిరుగు ప్రయాణమవుతుంది.

## అన్వయము

### ఎంతో గొప్ప ప్రధాన యాజకుడు (8:1)

"మన ప్రధాన యాజకుడు పని చేయుచున్నాడని మనము చూడగలము, మీ ప్రధాన యాజకున్ని ఎవరును ఎప్పుడును చూడలేదు. నిజముగా ఒక ప్రధాన యాజకుడు ఉన్నాడని మీకు ఎలా తెలుస్తుంది?" అని కొందరు యూదులు చెప్పుకొని యుండవచ్చు. క్రీస్తు యొక్క ప్రధాన యాజకత్వము క్రైస్తవునికి వాని విశ్వాసమునకు సంబంధించిన విషయమై యున్నది. ఈ విషయం ప్రేరేపింపబడిన ఒక రచయిత చేత బయలుపరచబడింది, గనుక మనము దీనిని నమ్మవచ్చు. ఏ సత్యాన్నిగాని, సిద్ధాంతాన్నిగాని విశ్వసించని నిత్య శంకితుడొకడు, "నీ కంటికి కనబడని దేవుని నీవెలా నమ్ముతున్నావు?" అని ఒక క్రైస్తవుని ప్రశ్నించాడు. అందుకు ఆ క్రైస్తవుడు, "నీ మెదడును నీవు చూసావా? లేదు కదా? అలాంటప్పుడు నీకొక మెదడున్నదని నీకెలా తెలుసు?" అని చెప్పిన బదులు సమాధానం ఒక ఉత్తమమైన ప్రతిస్పందనయై యుండవచ్చు. విశ్వసించడానికి మనకు రుజువులున్నాయి మరియు పైన పేర్కొనబడిన నిత్యశంకితుడు వానికొక మెదడున్నదని నమ్మినట్లే మనము మన ప్రధాన యాజకుని యందు నమ్మకముంచుతున్నాము. మనకొక క్రొత్త నిబంధన ఉన్నది, గనుక మన యాజకుడు మనుష్యుల కంటికి కనబడునట్లు పరిచారము చేయడనే విషయాన్ని హెబ్రీ 7వ అధ్యాయం వివరిస్తుంది. ఆయన వేరొక గోత్రమునకు, యూదా గోత్రమునకు చెందినవాడై యున్నాడు, గనుక ఆయన ఒక ప్రధాన యాజకుడుగా పనిచేయడు. ఆయన మన దృష్టికి ఆవల పరిచారము చేయుచున్నాడు, కాని మనము ఒకానొక దినాన ఆయనను చూతుము. ఆయన పరలోకమందు నిజమైన గుడారములో పరిచారము చేయుచున్నాడు, ఇహమందు భౌతికమైన గుడారములో కాదు.

### ఈ యేసు ఎవరు? (8:1)

హెబ్రీ పత్రికలో యేసు హెచ్చింపబడిన మన ప్రభువు, యాజకుడు, మరియు

రాజుగా మనము చూస్తాము. కొందరు ఒక క్రీస్తును కలిగియుండాలని ఆశిస్తున్నారు, అట్లయినను ఆయన తగ్గింపబడిన రూపములో ఉండాలని వారు కోరుదురు. దేనినైనను స్వాధికారంతో అడుగని ప్రేమగల మెస్సీయ కావాలంటున్నారు. సిలువను మోయుమని ఆయన చెప్పకూడదు లేక వారి జీవితములను సంపూర్ణముగా ఆయనకే సమర్పించుమని అడుగకూడదు. వారికి ఒక రక్షకుడు కావాలి, కాని ఆయన నిర్దిష్టమైన నీతి నియమములను నియమించువాడై యుండకూడదు. అనేకుల దృష్టిలో, క్రీస్తు ఒక "అతీతమైన నటుడు," కాని పాపమును నిరసిస్తూ రూకలు మార్చువారిని పారదోలు ఉగ్రతగల దేవుడు కాదు. ఈనాడు చేయబడుతున్న అనేక బోధల్లో, "క్రీస్తు ప్రకటింపబడుతున్నాడన్నట్టు వి(అ)నిపించవచ్చు, కాని వాస్తవానికి అలా జరుగడం లేదు."[23] మనము ఈ జీవితంలో నడుచుకొనవలసిన తీరు విషయమై ఆయన అధికారమునకు ఒప్పుకుంటూ, ఆయన ఆదేశములను అంగీకరించుట ద్వారా మనము క్రీస్తు వైపు తిరిగితే తప్ప, మనము వాస్తవంగా ఆయన వైపు తిరుగనే లేదని అర్థం.

**పరలోకమందు ఆసీనుడై యున్నాడు (8:2)**

యేసు ఇప్పుడు దేవుని కుడి పార్శ్వమున కూర్చుండి యున్నాడు (పరిపాలించుచున్నాడు). దావీదు సింహాసనముపై ఆసీనుడగుటకు ఆయన లేపబడినాడని పేతురు ప్రకటించాడు (అపొస్తలుల కార్యములు 2:30–33). ఇది రాజుగాను యాజకుడుగాను పరిపాలించనై యుండిన "చిగురు" గూర్చి జెకర్యా పలికిన ప్రవచనమును నెరవేర్చుచున్నది (జెకర్యా 6:12, 13). క్రీస్తు ప్రస్తుత "సంఘ యుగము"లో పరిపాలించడని వెయ్యేళ్ల పరిపాలనకు ముందటి విషయమును గూర్చిన ఆలోచన చెప్పుచున్నది. సరికదా, పేతురు మరియు హెబ్రీ పత్రికలు ఆయన ఇప్పుడు పరిపాలించుచున్నాడని చెప్పుతున్నవి. "సంఘ యుగము" క్రొత్త నిబంధన ప్రకారమైన క్రీస్తు రాజ్యమునకు భిన్నమైనదిగా లేదు. సంఘము రాజ్యము యొక్క ప్రస్తుత "ప్రత్యక్షతయై" యున్నదని కొందరు అనుకొనరు; కాని రక్షింపబడినవారందరు సంఘములో చేర్చబడిరి (అపొస్తలుల కార్యములు 2:47) మరియు తద్వారా రాజ్యములో పాపము నుంచి విమోచింపబడిరి (కొలొస్సయులకు 1:13, 14) గనుక, ఆచరణాత్మకమైన తేడా లేదు.

**సజీవమైన బలులు (8:3)**

మనము మన శరీరములను "సజీవ యాగము"గా అర్పింపవలసి యున్నది (రోమీయులకు 12:1, 2), కాని "జీవితమంతా ఆరాధనయే" అని ఇది అర్థమీయదు. దేవుని ఆరాధన ఆయన నియమించిన విధానంలో జరిపింపబడవలెను. తన తండ్రిని గౌరవించాలని ఆశించు పిల్లవాడు తన సొంత విధానాన్ని ఏర్పరచుకొనడం ద్వారా వాడు ఆయనను సంతోషపరచడు. దానికి బదులుగా, వాడు తన నేర్పించిన జీవిత విధానంలో జీవించడం ద్వారా వాడు ఆయన సంతోషపరచగలడు. మన పరలోకపు తండ్రి ఆరాధన విషయంలో కూడ ఏంతే. దేవుడు ఏదో ఒక విధానాన్ని అంగీకరించడు. అంగీకారయోగ్యమైన హేబెలు అర్పణ మరియు అనంగీకారమైన కయీను అర్పణకు మధ్య ఆయన తీవ్రమైన తేడాను కనుపర్చాడు (ఆదికాండము 4:1–5; హెబ్రీయులకు 11:4). హేబెలు "విశ్వాసముతో" అర్పించాడు,

అనగా దేవుడు ఏ విధమైన అర్పణకు అధికారమిచ్చాడో ఎరిగియుండి దాని ప్రకారం జాగ్రత్తతో ప్రవర్తించాడు (రోమీయులకు 10:17). హేబెలు దేవుని గౌరవపరచుటకుగాను ఒక విగ్రహమును చేయుట వంటి మరొక విధానాన్ని ఎన్నుకొని యుండవచ్చు; కాని దేవుడు బల్యర్పణకైన అధికారమిచ్చాడు గనుక ఆయన దానిని అంగీకరించియుండేవాడు కాదు.

మనకు గోచరమగు "బహుమానములను" మనకిష్టము వచ్చినట్టు ఉపయోగించుట ద్వారా మనము దేవుని సంతోషపరచగలమా? కూరగాయలు పండించే నిపుణుడైన రైతు తన ఆరాధనగా కూర మొక్కలను తనకిష్టమైన రీతిలో పెంచాలని ఆశిస్తాడని అనుకుందాము – ఈ పని అతడు సభలో చేయగలడా? దేవుడు మనకొక విధానమును నిర్ధేశించినప్పుడు, వ్రాతమూలంకంగా ఉన్న దానిని దాటి మనము ఆవలకు వెళ్లకూడదు (1 కొరింథీయులకు 4:6). ఆ విధంగా చేయడానికి క్రీస్తునందు మనకున్న స్వతంత్రము (గలతీయులకు 5:1) మనకు స్వేచ్ఛనివ్వదు. క్రొత్త నిబంధన మనలను ధర్మశాస్త్రము నుంచి విడిపిస్తుంది, కాని దేవుని నిర్దిష్టమైన చిత్తమునకు మనము అవిధేయులమైనప్పుడు అది మనలను పాపము నుంచి విడిపించదు.

క్రీస్తు నిరంతరము ఎడతెరిపిలేని బల్యర్పణలు చేయుచున్నాడనే అంతర్భావమును కూడ ఈ వాక్యభాగము చూపించుట లేదు. క్రీస్తు మన పక్షాన విజ్ఞాపనము చేయు యాజకుడుగా కొనసాగుతున్నాడు, కాని బలులు అర్పించు యాజకుడుగా కాదు. ఆయన బల్యర్పణ కార్యము పునఃరావృతము చేయబడజాలనిదై యున్నది (హెబ్రీయులకు 9:28). అర్పించడానికి ఆయన యొద్ద ఏదో ఒకటి ఉండింది (వచనము 3), కాని ప్రతి దినము బలులు అర్పించుట అనవసరము.

**మాదిరి చొప్పున (8:5)**

బైబిలు కొన్ని పర్యాయములు "మాదిరులు" సూచిస్తుంది. తప్పనిసరిగా లోబడాల్సిన ఒక *ఉపదేశ క్రమము* గల సిద్ధాంతము వారు పాపము నుంచి విడిపింపబడునట్లు క్రైస్తవులను నడిపిస్తుంది. రోమా క్రైస్తవులు "బోధింపబడిన ఉపదేశ క్రమమునకు *లోబడినప్పుడు*" వారి పాపము నుంచి విడిపింపబడి స్వతంత్రులుగా చేయబడ్డారని రోమీయులకు 6:17, 18 స్పష్టంగా చెప్పుతుంది. ఈ "ఉపదేశ క్రమము"లో ఏదో ఒక *మాదిరి* కలిసియుండవలెను. సువార్త మంచిది మరియు మహిమాన్వితమైన వర్తమానమై యున్నది, కాని దానికి లోబడుటకు సువార్తలో ఏ "ఉపదేశ క్రమము" ఉన్నది? ఈ సహోదరులు క్రీస్తు లోనికి మరియు ఆయన మరణము లోనికి ప్రవేశించిన సమయమును ప్రస్తావిస్తూ ఈ విషయాన్ని పౌలు రోమీయులకు 6:3, 4లో ఇదివరకే వివరించాడు. ఇది బాప్తిస్మము సమయంలో జరిగింది. మరణించుట, పాతిపెట్టబడుట, మరియు తిరిగి లేపబడుట యను *ఉపదేశ క్రమము*, క్రీస్తు లోనికి ముంచబడిన చర్యలో నిర్వహింపబడింది. *ఉపదేశ క్రమమునకు* లోబడుట ముఖ్యమై యున్నది ఎందుకనగా "క్రీస్తునందలి" రక్షణ ప్రదేశం లోనికి ఒకడు విధేయతతో ప్రవేశించే తీరు ఇదే మరియు తద్వారా ఆయన మరణంలో గల ప్రయోజనాల్లో పాల్గొనును (రోమీయులకు 6:4). అప్పుడు వాడు నూతన జీవముతో నడుచుకొనునట్లు లేపబడును (రోమీయులకు 6:5), ఇది నూతన జన్మము యొక్క పరిణామమై యున్నది. ఒకడు పరిశుద్ధాత్మ ఉపదేశమునకు వాని తొలి విధేయతను చూపించడం పూర్తి చేసినప్పుడు

ఇదంతా జరిగిపోతుంది. ఇది పరిశుద్ధాత్మ బాప్తిస్మమునకు వర్తింపబడజాలదు ఎందుకనగా బాప్తిస్మము పొందినవాడు దానిలో నుంచి లేచాడని చెప్పబడుతుంది (రోమీయులకు 6:4, 5), ఇది జలమయమైన సమాధిలో నుంచి బయటకు వచ్చుచున్న దానినే సూచింపగలదు. ఒకడు "పరిశుద్ధాత్మ వలని బాప్తిస్మము" నుంచి లేవడు, ఇది అపొస్తలులు ఆయన చేత శక్తితో నింపబడిన తీరును వర్ణించు రూపకాలంకార విధానమై యున్నది.

ఒక "మాదిరి" ప్రతి వివరమును తెలియజెప్పనవసరము లేదు. ఉదాహరణ అపొస్తలులు బాప్తిస్మమిచ్చుచుండినప్పుడు బాప్తిస్మము పొందు వాని ముఖమును క్రిందికి పెట్టి ముంచారా లేక వాని తలను వెనుకకు పెట్టి ముంచారా? ఆ సమయంలో వారిని నీళ్లలో దొర్లించడం జరుగుతుందా? ఇటువంటి వివరాలేవీ నిర్ధిష్టముగా పేర్కొనబడలేదు – కాని ముంచడమంటూ జరిగింది, ఏలయనగా *baptisma* అనే పదము ఎల్లప్పుడు ఇదే అర్థమునిచ్చినది. మోషే, నోవహు, మరియు ఇతరులు అనుసరించిన కచ్చితమైన విధేయత గూర్చిన సూత్రము నేడు మనకు కూడ వర్తిస్తుంది.

అధికార మాదిరి విషయంలో క్రొత్త నిబంధన విధానాన్ని కొందరు ఎందుకు ఆక్షేపిస్తారు? "నిక్కచ్చియైన మాదిరి ఏదీ లేదని" కొందరంటారు. వాస్తవానికి మాదిరి అంటూ ఏదైనా ఉన్నట్లయితే, కొంత మేరకు అది కచ్చితమైనదై యుండకూడదా? బాప్తిస్మమంటే ముంచడమా? బాప్తిస్మము పాప విమోచనము కొరకా? అపొస్తలుల కార్యములు 2:38 మరియు 22:16 చదువండి. ఔను అని ప్రభువు సంఘములోని ఎక్కువ మంది సభ్యులు ఒప్పుకుంటారు మరియు ఈ విషయంలో మనము రాజీపడజాలము లేదా దానిని వదులుకోలేమనే విషయంలో వారు ఏకీభవిస్తారు.

ఒక మాదిరి లేకుండా, క్రొత్త నిబంధన క్రైస్తవ్యము పునఃరుద్ధరింపబడవలెనను విన్నపమునకు అవసరమయ్యే అధికారమునకు ఎలాంటి ఆధారముండదు. సిద్ధాంతపరమైన గట్టి పవిత్రత లేనట్లయితే, కచ్చితమైన ప్రమాణములతో కూడిన నైతిక పవిత్రత కూడ ఉండనేరదు.

**మరి యెక్కువైన నిబంధన (8:6)**

ఆయన రక్తము ఒక క్రొత్త నిబంధనను ప్రవేశపెట్టుచున్నదని యేసు సెలవిచ్చినప్పుడు (మత్తయి 26:28), నిర్గమకాండము 24:8లోని మోషే మాటలను ఆయన నిస్సందేహంగా అరువు తెచ్చుకొనుచుండెను: అప్పుడు మోషే రక్తమును తీసికొని ప్రజల మీద ప్రోక్షించి, "ఇదిగో యీ సంగతులన్నిటి విషయమై యెహోవా మీతో చేసిన నిబంధన రక్తము ఇదే" అని చెప్పెను.

అదే సమయంలో, యేసు ఒక తీవ్రమైన మరియు ఉద్దేశపూర్వకమైన తారతమ్యమును చూపించాడు, ఏలయనగా "పాపక్షమాపణ నిమిత్తము" అనే మాటలను ఆయన చేర్చాడు. మోషే ఒక జంతువు యొక్క రక్తమును ఉపయోగించాడు; చివరి రాత్రి భోజన సమయంలో, యేసు తన సొంత రక్తమును, మరుసటి దినాన చిందింపబడనై యుండిన రక్తమును, సూచించడానికి "ద్రాక్షారసము" (మత్తయి 26:29) ఉపయోగించాడు. మోషే నియమములతో కూడిన నిబంధన గూర్చి మాటలాడుచుండెను; యేసు కృప, ప్రేమ, మరియు కనికరముతో కూడిన నిబంధన గూర్చి చెప్పుచుండెను. దేవుడు తన ప్రజలతో కూడ నిలిచియుండునట్లు

మోషే పాక్షిక పాప క్షమాపణను వర్ణించాడు; దేవుడు తన ప్రజల అంతరంగములో భిన్నమైన తీరులో నివసించునట్లు యేసు యథార్థమైన మరియు సంపూర్ణమైన పాప విమోచనమును సమకూర్చాడు.[24]

క్రొత్త నిబంధన విషయంలో మరి యెక్కువైన విశేషమేమిటి?[25] అది సమాధానమును సమకూర్చునదై యున్నది. అది దేవుని జనులందరు ఒక్క శరీరముగా కూడుకొనునట్లు వారిని సమర్థవంతులను జేస్తుంది (ఎఫెసీయులకు 2:14–18). అది అంతరంగమునకు సంబంధించింది, ఒకడు రాజ్యములో ఉండి క్రొత్త నిబంధన మేళ్లను అనుభవించునట్లు దేవుని వాక్యము నివశింపవలసి యున్న మన హృదయాంతరంగము లోపల నుంచి మనము ప్రోత్సహింపబడునట్లు చేస్తుంది. అది సార్వత్రికమైనది, మానవులందరిని క్రీస్తు నందలి దేవుని కనికరమను పందిరి క్రిందకు తెచ్చుటకు రూపొందింపబడింది (మత్తయి 28:18–20). అది ధారాళామైనది, సకల మానవులకు మన్నింపునిస్తుంది (హెబ్రీ 2:9). చివరిగా, అది శాశ్వతమైనది; అది చిరకాలము నిలిచియుండుననే అభయం మనకివ్వబడింది. అది ఎన్నడును వాడుకలో లేనిదిగా మారదు లేదా కాలం చెల్లినది అవదు.

**క్రొత్త నిబంధన (8:7)**

క్రొత్త నిబంధన గూర్చినవి అనేక ముఖ్య సత్యములు గమనింపబడవలసి యున్నవి:[26]

1. *అది అభయమిచ్చు నిబంధన.* దేవుడు మన దేవుడై యున్నాడనియు మనము ఆయన ప్రజలమై యున్నామనియు అది మనకు హామీ ఇస్తుంది (వచనము 10). మనము ఆయనతో కూడ ఈ నిబంధన సంబంధము కలిగియున్నప్పుడు, ఆయన మన పాపములను మర్చిపోవునని అది మనకు అభయమొసగుచున్నది (వచనము 12). ఇది నిశ్చయము ఎందుకనగా 8:10–12లో "నేను ... ఉంచెదను/ఉందును" మొదలగునవి అని దేవుడు ఆరు సార్లు సెలవిచ్చాడు! ఆయన చెప్పింది చేస్తాడని మనము ధైర్యముతో కూడిన అభయముగలవారమై యుండవచ్చు.

2. *అది విధేయత గూర్చిన నిబంధన.* దేవుడు ఆయన చేయాల్సింది చేస్తాడు, కాని మన ముందుంచబడుతున్న షరతులను తీర్చుట ద్వారా మన వంతుకు మనము చేయాల్సింది కూడ మనము చేయాలి. "నిబంధన" అని అర్థమిచ్చు గ్రీకు పదము అంగీకరించవలసిన ఒక ప్రతిపాదనను మరియు తీర్చవలసిన షరతులను అందజేయు ఒక గొప్పవానిని సూచిస్తుంది. ఆయన ఇశ్రాయేలీయులను ఒక ప్రత్యేక జనముగా చేయునని దేవుడు వాగ్దానము చేసియున్నాడు (నిర్గమకాండము 19:5, 6), ఇదే పని ఆయన క్రైస్తవుల యెడల కూడ చేసాడు (తీతు 2:14; 1 పేతురు 2:5, 9). ఆయన నియమములు ఇప్పుడు మన హృదయములలో వ్రాయబడి యున్నవి, అయితే దీనర్థమేమిటి? మనము దేవునికి మన హృదయాంతరాళములో నుంచి లోబడవలసి యున్నది. దేవుని నియమము మనలో ఉన్నట్లయితే, మనము ఈ పని చేయగలము (ద్వితీయోపదేశకాండము 30:11–14; యెహెజ్కేలు 11:19, 20; కీర్తనలు 40:6–8). యూదులు ధర్మశాస్త్రమును వారి దృష్టికి చాలా దూరంలో ఉన్న లక్ష్యంగా ఉంచుకున్నారు, వారి సొంత సాంప్రదాయములను సహితం అభివృద్ధి చేసుకున్నారు. ప్రథమమందు, వారు ధర్మశాస్త్రమును ఉల్లంఘించకుండా ఈ సాంప్రదాయములు వారికి కాపుదల నిచ్చు అడ్డంకిగా ఉండునని వారు ఉద్దేశించారు, కాని

రాను కాను వారికి ధర్మశాస్త్రము కంటె వారి సాంప్రదాయమే ఎక్కువ ప్రశస్తమైనదయ్యింది (మత్తయి 15:5–9 చూడుము). దేవుని ఎరిగియుండుటలో ఆయన చిత్తమును నెరవేర్చుట కూడ కలిసియున్నది. దుర్నీతిపరులైన ఇశ్రాయేలీయులు దేవుని ఎరుగలేని హోషేయ వారిపై అపవాదు మోపాడు; ఇట్టి తెలివి లోపించినందువలన జనాంగము నాశనము చేయబడవలసి యుండినది (హోషేయ 4:1, 2, 6). దేవుని ఎరిగియుండుట అనగా న్యాయమును మరియు నీతిని అమలు చేయుట యని యిర్మీయా ప్రవక్త కూడ ఘోషించాడు; వారు దేవుని ఎరిగియుండలేదని అమాయకుల రక్తమును చిందించుట మరియు బలహీనులను అణగద్రొక్కుట సూచించాయి (యిర్మీయా 22:15–17). ఒకడు సువార్తకు లోబడితే తప్ప, ఈనాడు ఎవరును దేవునిని యథార్థముగా తెలిసికొనలరని అర్థం (2 థెస్సలొనీకయులకు 1:6–10).

3. *అది కృపతో కూడిన నిబంధన.* అన్నిటిని మించి, దేవుడు మన యెడల "కనికరముగలవాడై" యున్నాడు (వచనము 12). ఆయన క్షమాపణను అనుగ్రహించుట ద్వారా ఆయనకు మన పట్ల గల కనికరము రుజువుచేయబడుతుంది. ఇది క్రొత్త నిబంధనలోని ప్రధానాంశమై యున్నది (10:16–18; మత్తయి 26:28 చూడుము).

4. *అది నిరంతరము నిలిచియుండు నిబంధనయై యున్నది.* పాత నిబంధన కాలం చెల్లినదయ్యింది గనుక అది పత్రిక రచింపబడిన వెనువెంటనే అదృశ్యం కావలసిన అవసరం ఏర్పడింది (హెబ్రీయులకు 8:13). హెబ్రీ పత్రిక వ్రాయబడుచుండిన సమయంలో పాత నిబంధన యింకను అమలులో ఉండినదని "అదృశ్యమగుటకు సిద్ధముగా ఉన్నది" (వర్తమానకాల అసమాపక క్రియ) అనే పదజాలము సూచించుచున్నది, కాని అది అప్పటికే "పాతిగిలి ఉడిగిపోయింది" (అనిర్దిష్ట కాలము చేత వ్యక్తము చేయబడుతుంది, పూర్తి చేయబడిన ఒక చర్య). అది ఈ రెండూ ఎలా అయియుండగలదు? క్రొత్త నిబంధన ప్రకారం క్రీస్తు అదివరకే ప్రధాన యాజకుడుగా పనిచేయుచుండెను; కాని దేవాలయము, అంతరించిపోవుచుండిన దాని పరిచారములతో, యింకను అదృశ్యము కాలేదు. ఈ వచనము క్రీ.శ. 70లో జరుగనైయుండిన యెరూషలేము నాశనమును గూర్చిన ప్రస్తావనయై యుండును.

**ఇశ్రాయేలు మరియు యూదా (8:8)**

ఇశ్రాయేలు మరియు యూదా రాజ్యములు భౌతికముగా యింకను సంపూర్తిగా పునఃరుద్ధరింపబడలేదు గనుక క్రొత్త నిబంధన ఇంకను ఇవ్వబడలేదని వెయ్యేళ్ల పరిపాలనకు ముందటి కాలము గూర్చి యోచించు కొందరు ఊహించుకొనుచుందురు. క్రొత్త నిబంధన విషయంలో ఇదే అవసరమై యుండినట్లయితే, నేటి దినాల్లో సంపూర్తి పాప క్షమాపణ గూర్చిన మన నమ్మకము నాశనము చేయబడినట్లే అవుతుంది. పెంతెకొస్తు దినాన (అపొస్తలుల కార్యములు 2) ప్రారంభోత్సవము చేయబడిన క్రీస్తు యొక్క క్రొత్త నిబంధనలో యిర్మీయా 31:31–34లో గల ప్రవచనములోని ఒక్క విషయము నెరవేరకపోయినట్లయితే, దానిలోనిది ఏదియు నెరవేరలేదనట్టే. అది *నెరవేరినది,* గనుక క్రైస్తవులు సంఘములో వారి పాపముల గూర్చిన సంపూర్తి క్షమాపణ *కలిగియున్నారు.* క్షమాపణ మరియు క్రొత్త నిబంధన జంటగా సాగిపోతుంటాయి. క్రొత్త నిబంధన క్రీస్తు చనిపోయిన రెండు వేల

సంవత్సరములు లేక అంత కంటె ఎక్కువ సంవత్సరముల తరువాత అమలులోనికి వస్తుందని ఊహించుకొనడం విశ్వాసములో బలహీనులై యుండిన వారు హెబ్రీ పత్రికను చదువుచుండగా వారు యూదా మతమును విడిచిపెట్టవలెనని పట్టుదలతో ముందుకు నడిపించుటలో అది అంత సహాయకరముగా ఉండియుండదు. రాబోవుచుండిన క్రొత్త నిబంధన గూర్చిన ప్రవచనము నెరవేరిందనే సత్యం హెబ్రీయులకు 8–10 అధ్యాయాలను జాగ్రత్తగా వినువారికి ఎవరికైనా స్పష్టమవుతుంది. క్రొత్త నిబంధన యేసు కొరకు జీవించుట విషయమును శ్రేష్ఠమైన దానిగా చేస్తుంది.

**విశ్వసనీయమైన ఉపదేశం (8:8, 9)**

హెబ్రీ పత్రిక చేయుచున్నట్టుగా, మనము ఇతరులను క్రీస్తు నొద్దకు నడిపించవలెనని కోరినప్పుడు వారున్న స్థితి నుంచే మొదలుపెట్టవలెను. ఒక యూదులు పాత నిబంధనలో విశ్వసిస్తున్నట్లయితే, ఫిలిప్పు ఐతీయోపీయునితో చేసినట్లే, మనము పాత నిబంధనతో మొదలుపెట్టవలెను: "అందుకు ఫిలిప్పు నోరు తెరచి, ఆ *లేఖనమును* అనుసరించి అతనికి యేసును గూర్చిన సువార్త ప్రకటించెను" (అపొస్తలుల కార్యములు 8:35; ఉద్ఘాటన చేర్చబడింది). యిర్మీయా ప్రవచించినట్టుగానే (యిర్మీయా 9:16), యూదులు ప్రపంచమందంతటను చెదరిపోయారు. వారు, వారి లేఖనములతోపాటు, క్రీస్తునకు సజీవ సాక్ష్యముగా పనికివచ్చుచున్నారు. యూదుల బైబిలు గ్రంథం, క్రైస్తవ గ్రంథ పాఠముల నుంచి వేరుగా భద్రము చేయబడుచున్న గ్రంథం, ఈ ఉద్దేశమును సఫలము చేసుకోడానికి పనికివచ్చుచున్నదని చూపించడానికి మనము పాత నిబంధనను ప్రయోగింపవచ్చు. ఇటువంటి రుజువు అనేకులు క్రీస్తు నొద్దకు రాడానికి వారిని పట్టుదలతో ముందుకు నడిపిస్తుంది. క్రైస్తవులకున్న విధంగా వారి విశ్వాసమును లేదా రచనలను రూఢిపర్చుకోడానికి ఇతరులకు తెరువు లేదు. క్రొత్త నిబంధనలోగల పాత నిబంధన ప్రవచనముల నెరవేర్పులకు మద్ధత్తుగా మనకు పునఃరుత్థానుడైన మన ప్రభువు ఉన్నాడు మరియు స్వతంత్ర యూదు లేఖనములున్నవి. యూదులు, వారి పవిత్ర గ్రంథంతోపాటు, క్రీస్తునకు ఎల్లప్పుడు ఒక సాక్ష్యముగా ఉందురు. మన విశ్వాసమునకు ఒక సహాయకరమగు ఉపకరణముగా వారు ప్రపంచ నలుమూలల్లో జీవిస్తున్నారు. పాత నిబంధన ఆదరణను మరియు ఆదేశములను ఇచ్చుచునే యున్నది (రోమీయులకు 15:4; 1 కొరింథీయులకు 10:11; గలతీయులకు 3:24).

**హృదయముల మీద వ్రాయబడి యున్నది (8:10)**

పరిశుద్ధాత్మ తన కార్యమును చేయుట ద్వారా, క్రైస్తవుడు పాపమును పూర్తిగా జయించుటకు వానిని సమర్థవంతునిగా చేయడానికి ఒకని హృదయంలో ఒక క్రొత్త శక్తి ఉంచబడి యున్నదని 8:10 సూచించుచున్నదని స్వాధికారంతో చెప్పుదురు. పాపమును జయించడానికి ప్రత్యేకమైన ఒక శక్తి మనలో దేవుని ఆత్మ చేత ఒప్పింపబడి యున్నట్లయితే, క్రైస్తవుడు వ్యక్తిగతంగా పాపమును జయించుటలో విఫలుడైనప్పుడు అది పరిశుద్ధాత్మ మరియు ఆయన శక్తిపై ప్రతిబింబిస్తుంది. మనము క్రీస్తునంగీకరించినప్పుడు ఒక "దైవికమైన స్వభావమును" పొందుదుమా? ఔను అని స్వాధికారంతో చెప్పడానికి

కొందరు 2 పేతురు 1:2-4 ఉపయోగిస్తారు, కాని పేతురు చెప్పింది అది కాదు. మనము దేవస్వభావమునందు "పాలివారమగునట్లు" అని పేతురు చెప్పుతున్నాడు. అనగా, ఆ స్వభావములో సంపూర్ణ పాలిభాగస్థులగునంతగా క్రైస్తవులు ఎదుగుటకు తరుణం ఇవ్వబడుతుంది. మానవ ప్రతిస్పందనను పరిశుద్ధాత్మ నియంత్రించదు. దేవుడు మానవ హృదయముపై బల ప్రయోగ చర్యలను చేపట్టడు.

దేవుని చిత్తము "మన హృదయముల మీద ఎలా వ్రాయబడగలదు?" ఈ క్రింది సన్నివేశమును ఒకసారి ఊహించుకొనండి. పాఠశాల ఉన్న ప్రాంతంలో నీవు పరధ్యాన్యంతో వాహనమును గంటకు 35 కి.మీ. వేగంతో నడిపిస్తున్నావు, అప్పుడు, అకస్మాత్తుగా, నిలిపియుంచబడిన రెండు వాహనముల మధ్యలో నుంచి ఒక ఏడేళ్ల అబ్బాయి వీధి లోనికి పరిగెత్తుకుంటూ వచ్చాడు. నీవు బ్రేకులను గట్టిగా అదిమి పట్టుకున్నావు - నీవు ఆగినప్పుడు, నీ వాహనము యొక్క ముందు బంపర్ పిల్లవానిని తాకుచున్నది. నీకు చల్లని చెమటలు కారుచుండును. ఒక పిల్లవాని ప్రాణమును తీసేటంత దగ్గరగా వచ్చేసావు కదా! ఆనాటి నుంచి, "పాఠశాల ప్రాంతము, 15 కి.మీ. వేగం" అని వ్రాయబడి వీధి ప్రక్కన తగిలించబడిన బోర్డును చూడాల్సిన అవసరం యిక మీదట ఎన్నడును నీకు రాదు. ఈ నిబంధన నీ హృదయములో ముద్రవేయబడిపోతుంది.[27]

"వారి హృదయముల మీద వాటిని వ్రాయుదును" అనగా మనము దేవుని చిత్తమును మన జీవితాల్లో ప్రథమ ప్రాధాన్యతగా చేసికొందుము, గనుక ప్రతి ఎంపిక విషయంలో దాని గూర్చి యోచిస్తాము మరియు ఆయన బయలుపరచిన ప్రకారం శ్రద్ధాభక్తులతో నడుచుకుంటాము. రాతి బొమ్మలను మనము పూజించము; విశేషంగా, మనము ప్రేమించు దేవుడు మరియు తండ్రి గూర్చిన ఆలోచనలతో మన హృదయములు నింపబడి యున్నవి. దేవ స్వభావమును మన ఉనికిలోనికి సంపూర్ణముగా తెచ్చేది, మనము దేవుని ప్రేనిస్తూ ఆయనకు లోబడవలెనని కలిగియుండు ఆ కోరికయే. మనము దేవుని ప్రేమించునప్పుడు, పాటలు పాడుట, ఆయనను ఆరాధించుట, మరియు బైబిలు తరగతులు మనకు ఆనందభరితమును మరియు పులకరింత కలుగజేయు అనుభుతులవుతాయి. తండ్రికి చేయబడు ఒక సామాన్య ప్రార్థన, విశ్వాసముతో, యథార్థముగా దేవున్ని తెలిసికొనినవాని కళ్లను ఆనంద బాష్పములతో నిండుగా నింపుతుంది. మనము యథార్థముగా దేవుని తెలిసికొని ఆయనను ప్రేమించునప్పుడు, మనము ఆయనను యికమీదట ఉగ్రుడైన దేవత్వముగా చూడము, కాని ప్రేమగల తండ్రిగా చూస్తాము. దేవుని యెదుట ఒప్పుకొనబడిన పాపము వెంటనే గ్రంథములో నుంచి తుడిచివేయబడిందని తెలుసుకున్నప్పుడు మనము చెప్పశక్యముకాని భావోద్రేకములతో ఉప్పొంగిపోతాయి. దేవుడు మన పక్షమున ఉన్నాడని రోమీయులకు 8:31 సెలవిస్తున్న మాటలను మనము పూర్తిగా నమ్ముదుము. అలాగైతే, ఆయన వాక్యమును మన హృదయములనెడు పలకల మీద వ్రాసుకుందామా!

### వారి మనస్సులో ధర్మవిధులు (8:10)

వారి "క్రీస్తునందలి స్వతంత్రము" ధర్మశాస్త్రమందటిని మరియు నిర్బంధమును వారి మీది నుంచి తొలగిస్తుందని అనుకొనేవారు గొప్ప పొరపాటే చేస్తున్నారు, ఏలయనగా ఒకడు ఆయన "ఆజ్ఞలను" గైకొనుట ద్వారా వాడు ప్రభువును ప్రేమిస్తున్నాడని చెప్పుకొనగలడు

(యోహాను 14:15). ప్రేమ కలిగియుండుట నిజముగా ధర్మశాస్త్రమును నెరవేర్చినట్టే అవుతుంది (రోమీయులకు 13:8–10), కాని ఒకడు ప్రభువును ప్రేమిస్తున్నాడు గనుక వాని మీద నుంచి ధర్మశాస్త్రమంతయు తొలగింపబడిందని అర్థం కాదు. మోషే ధర్మశాస్త్రమునుబట్టి లేదా ఇతరమైన ఏ నియమములతో కూడిన పద్ధతినిబట్టి ఎవడును నీతిమంతుడుగా తీర్చబడడు, కాని ఒక "నిబంధన" కొన్ని షరతుల ఆధారంగా నెరవేర్చబడు వాగ్దానముల గూర్చిన ధ్వనింపు నిస్తుంది.

ఆయన మోషే ధర్మశాస్త్రము నుంచి స్వతంత్రుడై యుండెనని పౌలు ఎరిగియుండెను, కాని ఆయన ఇంకను "క్రీస్తు విషయమైన ధర్మశాస్త్రము క్రింద" ఉండెనని సెలవిస్తున్నాడు (1 కొరింథీయులకు 9:21). మనము లోబడవలెనని సాధికారంగా కోరుతున్నది దేవునితో మనకు గల ఒడంబడికయే విధేయత చూపకుండా ఒకడు ప్రభువును ప్రేమిస్తున్నాడని నిజముగా చెప్పగలడా? సువార్తకు లోబడకుండా ఒకడు రక్షింపబడగలడా (2 థెస్సలొనీకయులకు 1:6–10; 1 పేతురు 4:17)? "బలులు అర్పించుట కంటె ఆజ్ఞను గైకొనుటయు, పొట్టేళ్ల క్రొవ్వు అర్పించుట కంటె మాట వినుటయు శ్రేష్ఠమని" సమూయేలు రాజైన సౌలుతో చెప్పాడంటే అందులో ఆశ్చర్యమేమి లేదు (1 సమూయేలు 15:22బి).

ఒకడు ఏ నియమమునైనను పాటించుట ద్వారా రక్షణను సంపాదించుకొనలేడు ఎందుకనగా ఎవడును పరిపూర్ణముగా జీవించుట లేదు (రోమీయులకు 3:23). ఎవడును రక్షణను "సంపాదించుకొన" లేకపోయినప్పటికిని, ప్రతి ఒక్కడు క్రీస్తు ఇచ్చుచున్న ప్రేమగల పిలుపునకు తన సొంత చొరవ చొప్పున ప్రతిస్పందించాల్సిన అవసరమున్నది (మత్తయి 11:28–30; ప్రకటన 3:20). మనము అన్ని ఆజ్ఞలకు లోబడినప్పటికిని, మనము యింకను "నిష్ప్రయోజకులమైన దాసులమే" (లూకా 17:10). ఒకడు రక్షింపబడినాడంటే, అదంతా దేవుని మహా కృపయే.

### దేవునితో సహవాసము (8:10, 11)

"నేను వారి దేవుడనై యుందును" మరియు "అందరు నన్ను తెలిసికొందురు" అనేవి క్రొత్త నిబంధనలోని ప్రాముఖ్యమైన వాగ్దానములై యున్నవి. మనము ఆయనతో నడుచుకొనుచు, ఆయన కొరకు జీవించినప్పుడు మనము దేవునితో కొనసాగుచునుండు సహవాసము కలిగియున్నామని అర్థం. ఇది లేఖనములలోని ఏదో అడపాదడపాగా తెలియజెప్పబడుతున్న ఆలోచన కాదు; ఇది అనేక విధాలుగా సూచింపబడింది. ఒకడు వాని హృదయమనెడు "తలుపు తీసి" ఆయనను లోనికి అనుమతించిన యెడల ఆయన వానితో కూడ భోజనము చేయునని ప్రకటన 3:20లో యేసు వాగ్దానం చేసాడు. "నీవు నన్ను పంపితివని లోకము నమ్మునట్లు, తండ్రీ నా యందు నీవును నీయందు నేనును ఉన్నలాగున వారును మనయందు ఏకమై యుండెవలెనని" అంటూ యేసు యోహాను 17:20, 21లో క్రైస్తవుల కొరకు ప్రార్థన చేసాడు. క్రైస్తవులు తండ్రి మరియు కుమారుని "లో" ఉండవచ్చు, ఇది నిశ్చయంగా సన్నిహితమైన సహవాసమును సూచించుచున్నది. ఆయన ద్రాక్షావల్లి అనియు, శిష్యులు "ద్రాక్షావల్లిలోని తీగెలైయున్నారని" యేసు సెలవిచ్చాడు (యోహాను 15:5). వారు "క్రీస్తు నందు, ద్రాక్షావల్లియందు, నిలిచియుండుట" శిష్యుల కర్తవ్యమైయున్నది; ఆయనయందు నిలిచియుండనివాడు, నరికివేయబడి కాల్చివేయబడును

(15:6). "వెలుగులో నడుచుకొనుట" (1 యోహాను 1:7) అనగా క్రీస్తులో నడుచుకొనుట లేక, క్రీస్తును వెంబడించుటయై యున్నది.

మన దేవుడు ఇప్పుడు మనతో సన్నిహిత సహవాసముగలవాడై యున్నాడు; ప్రస్తుత జీవితంలో మనము ఆయన పిల్లలమై యున్నాము. వారు లోకములో నుంచి వెలుపలకు వచ్చి వేరై యుండవలెనని పౌలు కొరింథీయులకు మందలించాడు – తత్ఫలితంగా మనము ఆయన వారమవుదుము మరియు ఆయన మన దేవుడగును (2 కొరింథీయులకు 6:16–18). ప్రకటన 21:3, 4; తరచుగా పరలోకమునకు అన్వయింపబడుచుండగా, దేవుడు ఇప్పుడు మనతో కూడ నివసించుచున్నాడు. ఆయన మన దుఃఖములను మరియు భయములను తీసివేయును, మరణపు ముల్లును తొలగించును (హెబ్రీయులకు 2:14, 15 చూడుము). క్రీస్తునందు, మనము దాసత్వము నుంచి స్వతంత్రులమయ్యాము. దేవుడు మనతో కూడ నుండుట ప్రస్తుత వాస్తవికతయై యున్నది. ఇందతా గాక ఇంత కంటె ఎక్కువ క్రొత్త నిబంధన మనకు వాగ్దానము చేయుచున్నది.

అంత్య కాలము వచ్చినప్పుడు, దేవుడు మనతో కూడ సంపూర్ణముగాను నిరంతరమును నివసించును. సంఘము పరలోకమునకు ముందుఛాయగా నిలుస్తున్న ప్రస్తుత వాస్తవికతయై యున్నది (ప్రకటన 21:3). మన జీవితములకు ఈ లోకములో మనము స్వాధికారముతో అడుగలేనంతగా వాగ్దానము యొక్క గొప్పదైన నెరవేర్పు నిజమై యున్నది.

క్రొత్త నిబంధన ప్రకారం, మనము యింకను "వెలి చూపు వలన గాక, విశ్వాసము చేతనే నడుచుకొనుచున్నాము" (2 కొరింథీయులకు 5:7). మనము "వ్యక్తిగతమైన అనుభవము" వలన కాదు, కాని దేవుని వాక్యము వలన కలుగు విశ్వాసము ద్వారా మనము దేవుని ఎరుగుదుము (రోమీయులు 10:17). దేవుడు మనలను వ్యక్తిగతముగా ఎరుగును, కాని మనము ఆయనను ఆ విధంగా ఎరుగము. మనము బైబిలు అధ్యయనము మరియు తెలివియందును, విశ్వాసమునందును ఎదుగుట ద్వారా మనము ఆయనను మనకు అవసరమైన ప్రతి విధంగా ఎరుగగలము. జీవితములోని అనుభవములు, అవి మంచివైనా చెడువైనా, మనము ఆయన వాగ్దానములను మరియు దీవెనలను మరి ఎక్కువగా అనుభూతి చెందునట్లు మనకు సహాయపడగలవు. ఔను, మనము దేవుని యందు వ్యక్తిగతముగా విశ్వాసముగలవారమై యుండవలెను, కాని మన సంబంధమును పరస్పరము "వ్యక్తిగతము" చేయునది మనము ఆయనతో కలిగియుండు ఏ అనుభవమైనను మహిమ కొరకు వేచియుండవలెను.

**విశ్వాసము మరియు పురావస్తుశాస్త్రము (8:13)**

హెబ్రీ పత్రిక రచింపబడుట ముగియు సమయానికి యెరూషలేము దేవాలయము నాశనమగును: "సూర్యుడు ఉదయించినప్పటికిని, చంద్రుడు యింకను అదృశ్యం కాలేదు."[28] "రాతి మీద రాయి యొకటియైనను ఇక్కడ నిలిచి యుండకుండ పడద్రోయబడునని" యేసు ముందుగానే తెలియజెప్పాడు (మత్తయి 24:2బి). యెరూషలేము దేవాలయము ఎందుకు నాశనం చేయబడిందో, ఇంకను చర్చనీయాంశముగానే మిగిలియున్నది. అది నాశనము చేయబడకూడదని తీతు ఆజ్ఞాపించాడని జోసీఫస్ చెప్పాడు. దేవాలయమును విధ్వంసము చేసిన మంటలు పాక్షిక వివరమై యుండవచ్చు; దేవాలయము బంగారముతో

అంత నిండుగా కప్పబడిన విషయాన్ని జ్ఞాపకము చేసుకుందాము. తీవ్రతరమైన మంటలు బంగారమును కరిగించివేయుచుండగా, కొంత బంగారము రాళ్లలోని పగుళ్లలోనికి కారి యుండవచ్చు. ఇట్టి రాళ్లను పగులగొట్టడము ద్వారా మాత్రమే సైనికులు బంగారమును వెలికి తీయగలిగారు. ఆ తరువాత వారు ఆ రాళ్లను వీధి లోనికి పారవేసారు. దేవాలయ "కట్టడములు" (మత్తయి 24:1) పూర్తిగా ధ్వంసమయ్యాయి, మరియు వాటిలోని అనేక రాళ్లు అవి క్రీ.శ. 70లో పడిన చోటనే నేటికిని నిలిచియున్నవి. మిగిలినవి నిస్సందేహంగా పాత యెరూషలేములోని ఇళ్లను కట్టుకొనడంలో ఉపయోగించుకొనబడి యుండును. యెరూషలేములో దేవాలయమే లేకుండినదని కొందరు నిత్యశంకితులు తర్కించారు, కాని పురావస్తు శాస్త్రమునకు సంబంధించిన త్రవ్వకాల నిదర్శనముల ద్వారా వారు పొరపాటుపడ్డారని రుజువయ్యింది.

బైబిలు విద్యార్థికి మరియు విద్వాంసునకు పురావస్తు శాస్త్రము ఒక గొప్ప ఉపకరణమై యున్నవి, కాని దేవుడు మరియు ఆయన వాక్యమునందు విశ్వాసమును పుట్టించడానికి బైబిలులోని రుజువులే ఆక్రమించుకొను స్థానాన్ని అది ఎన్నడును తీసికొనజాలదు. అది నిశ్చయంగా విశ్వాసమునకు సంబంధించిన నిదర్శనమును ఆకర్షకంగా అలంకరించగలదు మరియు బైబిలు సంబంధమైన అవగాహనను విస్తారంగా వికసింపజేయడానికి ఆసక్తికరమైన అనేక వాస్తవాలను సమకూర్చగలదు, కాని దేవుడున్నాడని, క్రీస్తు కన్యక గర్భమందు జన్మించాడని, లేదా ఆయన మృతులలో నుంచి తిరిగి లేచాడనే మొదలగునవి విషయాలను అది ఎన్నటికిని రుజువు చేయజాలదు. కళాకృతులు ఇతోధికంగా కనుగొనబడుచుండగా బైబిలు యొక్క చారిత్రాత్మక ఆధారం మరలా మరలా రుజువవుతుంది. గతంలో ఇది ఎంతో తరచుగా జరుగుతూనే వుండింది గనుక బుద్ధిమంతుడైన ఏ పాఠకుడైనా బైబిలును ఎందుకు సందేహిస్తాడో అర్థమవక ఆశ్చర్యంలో ముంచేస్తుంది. ఉదాహరణ పొంతి పిలాతు గూర్చి బైబిలు ఏనాడో సెలవిచ్చింది, కాని పురావస్తు శాస్త్రం సంబంధిత త్రవ్వకాల ద్వారా కైసరయ పట్టణంలోని శిథిలాల్లో లభించిన ఒక శిలాశాసన చిహ్నముపై అతని పేరు ఒక రాతిపై కనబడినప్పుడు, 1961 వరకు పిలాతు యొక్క చారిత్రాత్మక ఉనికి రుజువు చేయబడలేదు. ఈ విధముగా కనుగొనబడు విషయాలు విశ్వాసమును కలిగించవు, కాని విశ్వాసికి గొప్ప ఆదరణనిస్తూ వానిలో ఉత్తేజమును పురికొల్పగలవు.

సూచనలు

[1]"'సారాంశము' [KJV] అనే పదము *kephalaios* యొక్క అనువాదమై యున్నది, 'ముఖ్యమైన విషయము' అని అర్థమిచ్చుచున్నది. అది దీనికి ముందున్న సారాంశమును కాదు, కాని దాని తరువాతి ముఖ్య విషయమును సూచిస్తుంది" (Kenneth Samuel Wuest, *Hebrews in the Greek New Testament for the English Reader* [Grand Rapids, Mich.: Wm. B. Eerdmans Publishing Co., 1951], 140). [2]Gareth L. Reese, *A Critical and Exegetical Commentary on the Epistle to the Hebrews* (Moberly, Mo.: Scripture Exposition Books, 1992), 125, n. 5. [3]ఇది కొంత మేరకు నిజమై యుండవచ్చు, కాని దేవుడు కయపను యింకను ఆయన ప్రతినిధిగా పరిగణించి యుండవచ్చు, ఏలయనగా అతని ద్వారా పరిశుద్ధాత్మ కనీసం ఒక్క సందర్భములోనైనా ప్రవచనాత్మకంగా పలికాడు (యోహాను 11:47–53). [4]Robert Milligan, *A Commentary on the Epistle to the Hebrews*, New Testament Commentaries (Cincinnati: Chase and Hall, 1876; reprint, Nashville: Gospel Advocate Co., 1975), 276–80. [5]Donald Guthrie, *The Letter to the Hebrews: An Introduction and Commentary*,

The Tyndale New Testament Commentaries (Grand Rapids, Mich.: Wm. B. Eerdmans Publishing Co., 1983), 172. [6]F. F. Bruce, *The Epistle to the Hebrews*, The New International Commentary on the New Testament (Grand Rapids, Mich.: Wm. B. Eerdmans Publishing Co., 1964), 164–65. [7]Neil R. Lightfoot, *Everyone's Guide to Hebrews* (Grand Rapids, Mich.: Baker Books, 2002), 105. [8]పాపము నుంచి తప్పించుకోడానికే లోబడవలసిన విషయం గూర్చి చెప్తూ, పౌలు రోమీయులకు 6:17, 18లో అనే పదమును ప్రయోగించాడు. ఇచ్చటి 'మాదిరి" అనే పదము బాప్తిస్మములో ప్రదర్శింపబడు విధేయతను సూచింపవలసి యున్నది (6:3, 4), ఇది మనము చూపించు విధేయతలో పునఃఅభినయం చేయునప్పుడు కనబడు క్రీస్తు మరణించుట, పాతిపెట్టబడుట, మరియు తిరిగి లేచుటను గూర్చిన "రూపము" అయియున్నది. [9]క్రొత్త నిబంధన ప్రకారము ఆయనను సేవించాల్సిన విధానము విషయమై దేవుడిచ్చిన ఆదేశముల గూర్చిన "మాదిరి" అనే అభిప్రాయముపై James Burton Coffman మూడు పుటల చర్చలు ఇచ్చాడు. ఒకడు క్రీస్తునంగీకరించినప్పుడు ప్రదర్శించు విధేయతను చూపించు చర్యల కొరకు దేవునికి ఒక మాదిరి ఉన్నదనియు, ఈ ప్రకారమైన మాదిరిలో క్రీస్తునంగీకరించు ప్రతి ఒక్కడు అవే నియమములకు లేక "రక్షణ ప్రణాళికకు" లోబడవలసి యున్నదనియు ఆయన అపొస్తలుల కార్యముల గ్రంథమును ఆధారం చేసుకొని తర్కించాడు. మనము దేవుని ఆరాధించుటకు గల ఆ యా తెరువులను లేఖనములు నిర్దిష్టముగా తెలియజెప్పుతున్నవంటూ తన తర్కమును కొనసాగించాడు. అన్నిటిని మించి, క్రైస్తవ జీవితము జీవించడానికి ఒక మాదిరి ఉన్నదని ఆయన చూపించాడు. (James Burton Coffman, *Commentary on Hebrews* [Austin, Tex.: Firm Foundation Publishing House, 1971], 170–73.) [10]Jimmy Allen, *Survey of Hebrews*, 2d ed. (Searcy, Ark.: by the author, 1984), 89.

[11]Neil R. Lightfoot, *Jesus Christ Today: A Commentary on the Book of Hebrews* (Grand Rapids, Mich.: Baker Book House, 1976), 156. [12]Ibid. [13]Philo *Life of Moses, II* 15. [14]Bruce, 167. [15]"క్రొత్త" (*kainos*) అనే పదము "ఒక సరికొత్త రకము" అని అర్థమిచ్చుచున్నది. [16]Adapted from Milligan, 290–91 నుంచి అనుకూలించుకొనబడింది. [17]Guthrie, 175. [18]Bruce, 173. [19]Craig R. Koester, *Hebrews: A New Translation with Introduction and Commentary*, The Anchor Bible, vol. 36 (New York: Doubleday, 2001), 386–87. [20]Reese, 135, n. 42.

[21]Lightfoot, *Jesus Christ Today*, 160. [22]Warren W. Wiersbe, *Be Confident: An Expository Study of the Epistle to the Hebrews* (Wheaton, Ill.: Victor Books, 1982), 93. [23]Raymond Brown, *The Message of Hebrews: Christ Above All*, The Bible Speaks Today (Downers Grove, Ill.: InterVarsity Press, 1982), 142. [24]ఈ అభిప్రాయము Ray C. Stedman, *Hebrews*, The IVP New Testament Commentary Series (Downers Grove, Ill.: InterVarsity Press, 1992), 87 నుంచి అనుకూలించుకొనబడింది. [25]సంబంధిత వివరము Brown, 150–51 నుంచి అనుకూలించుకొనబడింది. [26]సంబంధిత వివరము Lightfoot, *Everyone's Guide to Hebrews*, 108–11 నుంచి అనుకూలించుకొనబడింది. [27]Adapted from Hugo McCord, *Fifty Years of Lectures* (Atwood, Tenn.: privately printed, n.d.), 183నుంచి అనుకూలించుకొనబడింది. [28]Arthur W. Pink, *An Exposition of Hebrews* (Grand Rapids, Mich.: Baker Book House, 1954), 436.